

'చంపేస్తాం, నరికేస్తాం, అంతుచూస్తాం'భాషతో రాజకీయాలు చేయడం వైసీపీకి అలవాటుగా మారింది. అధికారం కోసం ఎంతటి దిగజారుడుకైనా ఒడిగట్టేలా వారి తీరు ఉంది. రాజకీయ పార్టీలు ప్రజలకు మేలు చేస్తామని చెప్పాలి. మేము వస్తే ఉన్నవి పడగొడతాం, పనులు ఆపేస్తాం, యువతను చెడగొడతాం అన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


సోమవారం 13.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 356 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# మహిళా రిజర్వేషన్ బిల్లు వచ్చేస్తోంది!

## ఈనెల 16,17,18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

## మహిళా రిజర్వేషన్ చట్టంపై ప్రధాని మోదీ లేఖ

## మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదానికి ఎంపీలంతా ఏకం కావాలని పిలుపు

## లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు బీజేపీ త్రీలైన్ విప్



**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళా రిజర్వేషన్ చట్టాన్ని దాని నిజమైన స్ఫూర్తితో అమలుచేసే సమయం వచ్చిందంటూ లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ లేఖ రాశారు. 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్ కోటా అమల్లోకి వస్తుందని ఆయన వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ చట్టం (నారీ శక్తి వందన్ అధినియం)తో ముడిపడిన సవరణ బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించడానికి లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా ఏకం కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. విస్తృతమైన చర్చల తర్వాతే ఈ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తేవాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

**ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చారిత్రక చర్చ :** "2029 నుంచి మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వస్తే భారత ప్రజాస్వామిక సంస్థలకు కొత్త బలం లభిస్తుంది. వాటిపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. ప్రభుత్వాల పాలనలో ప్రజా భాగస్వామ్యం, ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది. దీనిపై ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చారిత్రక చర్చ మొదలుకానుంది. ఇందులో అన్ని పార్టీల ఎంపీలు భాగం కావాలి. కలిసికట్టుగా ముందుకు సాగేందుకు, అందరినీ మనతో కలుపుకు పోయేందుకు పార్లమెంటులో ఏకం అవుదాం. ఈ స్ఫూర్తితోనే నేను మీకు ఈ లేఖను రాస్తున్నాను. ఇప్పటికే మనమంతా అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని చూస్తున్నాం. మహిళలు శ్రమ, నిబద్ధతలతో తమ సామర్థ్యాలను చాటుకుంటున్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అనే అంశం చాలా దశాబ్దాల పాటు చర్చలకే పరిమితమైంది. కానీ మేం 2023లోనే దానిపై చట్టం చేశాం. ఆ చట్టం ఆమోదాన్ని పొందిన రోజు, భారత దేశ పార్లమెంటరీ ప్రస్థానంలో స్ఫూర్తిదాయక మైలురాయిగా నిలిచిపోతుంది. యావత్ ప్రపంచం ఆ ఘట్టానికి సాక్ష్యంగా నిలిచింది. దేశ జనాభాలో సగం ఉన్న మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచే దిశగా మా ప్రభుత్వమే ముందడుగు వేసింది. ఇప్పుడు త్వరితగతిన ఆ చట్టాన్ని అమల్లోకి తేవడంపై ఫోకస్ పెట్టాం. దీనితో ముడిపడిన రాజ్యాంగ వ్యవహారాలపై ఇప్పటికే నిపుణులు, రాజకీయ నేతలతో చర్చించాం. దేశ మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేక పార్లమెంటు సెషన్‌లో ఎంపీలంతా ఏకమై మాట్లాడాలి. చారిత్రక మార్పుకు నాంది పలకాలి" అని లేఖలో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

**లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు బీజేపీ విప్ :** మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లుల ఆమోదం కోసం పార్లమెంటు బడ్జెట్ సెషన్‌ను కేంద్ర ప్రభుత్వం 3 రోజుల పాటు పొడిగించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు తప్పకుండా హాజరు కావాలంటూ లోక్‌సభ, రాజ్యసభలలోని తమ ఎంపీలకు బీజేపీ ఆదివారం రోజు త్రీ లైన్ విప్‌ను జారీ చేసింది. మూడు రోజుల ప్రత్యేక పార్లమెంటు సెషన్ ముగిసే వరకు సభల్లో

మిగతా 2లో...

## 2027 జూన్ 26 నుంచి ఈ మహా పుష్కరాలు ప్రారంభం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే గోదావరి పుష్కరాలకు రంగం సిద్ధమవుతోందని, 2027 జూన్ 26 నుంచి ఈ మహా పుష్కరాలు ప్రారంభం కానున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టిందని, రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే మూడు కీలక సమావేశాలు నిర్వహించి, పుష్కరాల ఏర్పాట్లపై ప్రాథమిక రోడ్‌మ్యాప్ ను సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు.

మిగతా 2లో...

## బెట్టింగ్, జూద కార్యకలాపాలపై కఠిన చర్యలు.. డీజీపీ వార్నింగ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బెట్టింగ్, జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. ఏపీలో ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో జరుగుతున్న బెట్టింగ్, జూద కార్యకలాపాలు పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు.

మిగతా 2లో...

## క్వాంటం హబ్‌గా అమరావతి

- **అమరావతి వేదికగా సాకారమవుతున్న భారత క్వాంటం విప్లవం**
- **క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీతో ఏపీ నుంచి నూతన టెక్ శకం ప్రారంభం**
- **ఏప్రిల్ 14న 1 ఎస్, 1 క్యూ క్వాంటం టెస్ట్ బెడ్స్ ను ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ క్వాంటం దే పురస్కరించుకుని దేశ చరిత్రలో ఓ కీలక ఘట్టానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా ఏప్రిల్ 14వ తేదీన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్ లో రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. అమరావతి కేంద్రంగా ఆవిష్కృతం అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో టెక్ శకంలో నూతన అధ్యాయానికి నాంది పడనుంది. గన్నవరంలోని మేధా టవర్స్ తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్ లో ఏర్పాటు అవుతున్న 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం అమరావతి క్వాంటం వ్యాలీకి రానుంది. మేధాటవర్స్ లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్ లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్ లు క్వాంటం ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశారు.

మిగతా 2లో...

## మహిళా బిల్లుకు మద్దతుగా రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు



- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఆదివారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహిళల సాధికారతకు కీలకమైన 'నారీ శక్తి వందన్ అధినియం' దేశ చరిత్రలో ఒక చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ బిల్లుకు ఉభయ సభల్లో దాదాపు ఏకగ్రీవ మద్దతు లభించడం గర్వకారణమన్నారు. గతంలో పలు ప్రభుత్వాలు ప్రయత్నించినప్పటికీ అమలు దశకు తీసుకురాలేకపోయాయని విమర్శించారు.

జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యాక 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అవసరమైన సవరణలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఈ బిల్లుకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా ర్యాలీలు, సభలు, స్కూటీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే వాల్ రైటింగ్, సంతకాల సేకరణ, మిస్డ్ కాల్ క్యాంపెయిన్ల ద్వారా ప్రజల మద్దతు కూడగడతామని తెలిపారు. ఈ కార్యక్రమాలను కూటమి పార్టీలతో కలిసి నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషీధా రాజు మాట్లాడుతూ మహిళలకు పార్లమెంట్‌లో ఒక మూడవ వంతు ప్రాతినిధ్యం కల్పించడం గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. మహిళల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ముద్ర, పోషణ, అంగన్వాడీ, వాక్సినేషన్ వంటి పథకాలను అమలు చేస్తోందని చెప్పారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, రాష్ట్ర కార్యదర్శులు బొడ్డు నాగలక్ష్మి, కంభంపాటి మాధవి, కె. పద్మజ, ఎన్. లక్ష్మీ దుర్గ, సి హెచ్ శివలలిత, డి. స్వాతి రావు తదితరులు పాల్గొన్నారు.

## జల విద్యుత్ కేంద్రాల పనులు వేగవంతం



- **80 మెగావాట్ల సామర్థ్యంతో పోలవరంలో 12 యూనిట్లు**
- **వచ్చే ఏడాదికి 3 యూనిట్లు అందుబాటులోకి**
- **230 మెగావాట్లతో దిగువ సీలేరులో 2 యూనిట్లు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఏపీజెన్‌కో ఆధ్వర్యాన నిర్మిస్తున్న జల విద్యుత్ కేంద్రాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పోలవరం జలవనరుల ప్రాజెక్టు వద్ద 960 మెగావాట్ల సామర్థ్యంతో, దిగువ సీలేరు ప్రాజెక్టు వద్ద 230 మెగావాట్ల సామర్థ్యంతో జెన్‌కో వీటిని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ముఖ్యంగా పీక్ అవర్‌లో రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం విద్యుత్ బహిరంగ మార్కెట్‌ను ఆశ్రయించే అవకాశం తగ్గుతోంది. దీంతో విద్యుత్ వినియోగదారులపై భారాల ప్రభావం కూడా తగ్గే అవకాశం ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు వద్ద 960 మెగావాట్ల సామర్థ్యంతో

మిగతా 2లో...

## 'నారి శక్తి వందనం'తో చట్ట సభల్లో మహిళలకు ప్రాధాన్యత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళలకు చట్ట సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించే దిశగా 'నారి శక్తి వందనం' చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో పార్లమెంట్‌లో ఈ బిల్లుపై చర్చ జరగనుందని వెల్లడించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్ పరుశురామరాజు అధ్యక్షతన జరిగిన పత్రికా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, దేశంలో మహిళలు సగానికి పైగా ఉన్నప్పటికీ చట్ట సభల్లో వారి ప్రాతినిధ్యం కేవలం 13 శాతమేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకున్నారని అన్నారు. జనధన్ ఖాతాలు, స్టార్ట్ అప్, స్టాండ్ అప్ పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడినట్టు చెప్పారు. మహిళా సాధికారత మాటల్లో కాకుండా కార్యరూపంలో చూపించాలని ఎన్‌డీఏ కూటమి సంకల్పంతో ఉందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విజయవంతం కావాలని, వచ్చే ఎన్నికల నుంచే అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.

**ప్రతిపక్షాలపై మండిపాటు :** ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించిన మంత్రి.. కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు కూడా దాటలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ విమర్శలు చేయడం ఆశ్చర్యకరమన్నారు. రాష్ట్రంలో గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి పెట్టుబడులపై వైసీపీ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు.

మిగతా 2లో...

## జనగణనకు ప్రజలు సహకరించాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి: దేశవ్యాప్తంగా 2027 జనగణన ప్రక్రియ ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జనగణన నిర్వహణకు సంబంధించిన ముఖ్యమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. దేశంలో జనగణనను దశలవారీగా నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వం-కు హౌస్‌లిస్టింగ్ ఓ హౌసింగ్ సెన్సస్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనికి ముందు ప్రజలకు 15 రోజులపాటు సెల్ఫ్ ఎన్యూమరేషన్ సదుపాయం కల్పించనున్నారని సమాచారం. అలాగే మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ క్రమంలోనే రాష్ట్రంలో జరగబోయే 2027 జనగణన ప్రక్రియకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కూటమి ప్రభుత్వం కోరింది. 1948 జనగణన చట్టం ప్రకారం ప్రజల విధులు, బాధ్యతలను స్పష్టంగా తెలియజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 12న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

మిగతా 2లో...

# మహిళా రిజర్వేషన్ బిల్లు వచ్చేస్తోంది!



(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉండాలని నిర్దేశించింది. ఆ 3 రోజుల వ్యవధిలో ఎలాంటి సెలవులూ తీసుకోవద్దని సూచించింది. పార్టీ ఎంపీలంతా విప్‌ను కచ్చితంగా పాటించాలని, తప్పకుండా సభలకు హాజరై సహకరించాలని బీజేపీ కోరింది. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లుల ఆమోదం కోసమే బీజేపీ ఈ ఏర్పాట్లు చేస్తోంది. తాజాగా లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు ప్రధాని మోదీ లేఖ రాసింది కూడా ఇందుకోసమే.

**ప్రతిపాదిత మొదటి సవరణ :** ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సెషన్‌లో రెండు ప్రధానమైన సవరణలు చేయాలని మోదీ సర్కారు భావిస్తోంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని 2023లోనే భారత పార్లమెంటు ఆమోదించింది. దీన్నే నారీశక్తి వందన్ అధినియం చట్టం – 2023 పేరుతో పిలుస్తారు. దేశంలో మరోసారి జనగణన జరిగాకే మహిళా రిజర్వేషన్లను అమల్లోకి తేవాలనే నిబంధన నారీశక్తి వందన్ అధినియం చట్టంలో ఉంది. ఆ లెక్కన 2034 నాటికి మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. కానీ ఇప్పుడు 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నాటికే ఈ రిజర్వేషన్లను అమల్లోకి తేవాలని కేంద్రంలోని మోదీ సర్కారు నిర్ణయించింది. మరో జనగణనతో లంకె లేకుండా, చివరిసారిగా 2011లో జరిగిన జనగణన ప్రాతిపదికన వచ్చే (2029) ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లను అమలు చేసేలా నారీశక్తి వందన్ అధినియం చట్టం –2023లో సవరణ చేయనున్నారు.

**ప్రతిపాదిత రెండో సవరణ:** లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చట్టంలోనూ కీలక సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లను కేటాయించేందు కోసం ప్రస్తుత పురుష చట్టసభ సభ్యుల సీట్లను లాక్కోవాల్సిన అవసరం లేకుండా, లోక్‌సభ, అసెంబ్లీల్లో సీట్ల సంఖ్యను పెంచాలని మోదీ సర్కారు యోచిస్తోంది. ఇందులో భాగంగా లోక్‌సభ సీట్ల సంఖ్యను 543 నుంచి 816కు పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే అవకాశాలు ఉన్నాయి. ఈ లెక్కన 2029 నుంచి లోక్‌సభలో కచ్చితంగా 273 సీట్లు మహిళలకు రిజర్వ్ అవుతాయి. ఇదే ప్రాతిపదికన రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మహిళల కోసం సీట్లను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

# క్వాంటం హబ్‌గా అమరావతి



(మొదటి పేజీ తరువాయి)

**స్వదేశీ టెక్నాలజీతో రిఫరెన్సు ఫెసిలిటీ :** అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈ రెండు క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్ లో క్యూబిటెక్ సంస్థ 1 క్యూ పేరిట క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్ ను ఏర్పాటు చేసింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో 1 ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటం టెస్ట్ బెడ్ ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ లాంటి సంస్థలు సహకారం అందించాయి. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటైన ఈ టెస్ట్ బెడ్ ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సహా, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగంలోని పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్ ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరు కానున్నారు. ఏపీలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్ గా దాదాపు 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# 2027 జూన్ 26 నుంచి ఈ మహా పుష్కరాలు ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి)

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అత్యున్నత ప్రమాణాలతో సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

**పుష్కరాల నిర్వహణపై మంత్రుల సబ్ కమిటీ ఏర్పాటు :** పుష్కరాల నిర్వహణను పర్యవేక్షించేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రత్యకమైన మంత్రుల సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేశామని మంత్రి ఆనం తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతానికి చెందిన 12 మంది మంత్రులతో కూడిన ఈ కమిటీ, క్షేత్రస్థాయిలో పనులను సమన్వయం చేయనుందని ఆయన చెప్పారు. ఘాట్ల నిర్మాణం, రవాణా సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్యంపై ఈ కమిటీ నిరంతరం సమీక్షలు జరుపుతుందన్నారు. కోట్లాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఈ పుష్కరాలను నిర్వహిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# జనగణనకు ప్రజలు సహకరించాలి



(మొదటి పేజీ తరువాయి)

జనగణన నిర్వహణ కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని ప్రభుత్వం సూచించింది. నిబంధనల ప్రకారం జనగణన సిబ్బందికి ప్రశ్నలు అడిగే అధికారం ఉందని, వారు కోరిన సమాచారాన్ని సరైన విధంగా అందించాలని తెలిపింది.

అలాగే, సెన్సస్ అధికారులు అడిగే ప్రశ్నలకు సరైన సమాచారాన్ని ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొంది. తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇంటి యజమానులు సెన్సస్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని, ఇళ్లకు వేసే గుర్తులు లేదా నంబర్లు తొలగించడం నేరమని స్పష్టం చేసింది. అలాగే సెన్సస్ ఫారమ్‌లను సరిగ్గా నింపడం కూడా ప్రజల బాధ్యతగా పేర్కొంది.

సెన్సస్ చట్టం 1948 ప్రకారం నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించనున్నట్లు వెల్లడించింది. జనగణన అధికారులకు సహకరించని వారికి రూ. 1000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని సందర్భాల్లో జైలు శిక్ష కూడా ఉండొచ్చని హెచ్చరించింది. అయితే, జనగణన కోసం సేకరించిన వ్యక్తిగత వివరాలను ఇతరులు పరిశీలించే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేసింది. జనగణన ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావాలంటే ప్రజల సహకారం అత్యంత కీలకమని ప్రభుత్వం పేర్కొంది.

# జల విద్యుత్ కేంద్రాల పనులు వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)



జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక్కో యూనిట్ 80 మెగావాట్లతో మొత్తం 12 యూనిట్ల పనులు జరుగుతున్నాయి. సివిల్, ఎలక్ట్రో–మెకానికల్ పనులు సమాంతరంగా జరుగుతున్నాయి. ఒక్కో యూనిట్ సెకనుకు 331 క్యూబిక్ మీటర్ల నీటి ప్రవాహంతో, నిమిషానికి 100 రొటేషన్ల వేగంతో పనిచేసేలా వీటిని రూపొందించారు. దేశంలోనే అతిపెద్ద కాప్లాన్ టర్బైన్లలో ఇవి ఒకటిగా నిలుస్తాయని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఈ సాంకేతికత వల్ల నీటి ప్రవాహం మారుతూ ఉన్నా అధిక సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని చెబుతున్నారు. మాన్సూన్ కాలంలో అధిక నీటి ప్రవాహాన్ని వినియోగించుకోవడంతో పాటు గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల సమయంలో కూడా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రోజుకు 23 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఏడాదికి 2,500 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా జెన్‌కో పెట్టుకుంది. యూనిట్‌కు సగటు ధర రూ. 4.57లుగా అంచనా వేయగా, ఏడాదికి రూ. 1,100 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని అధికారులు అంటున్నారు. దీనివల్ల బహిరంగ మార్కెట్‌లో ఖరీదైన విద్యుత్ కొనుగోళ్లు తగ్గి వినియోగదారులకు స్థిరమైన విద్యుత్ ఛార్జీలు అందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2027 జులైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి కనీసం మూడు యూనిట్లను ప్రారంభించాలనే లక్ష్యంతో జెన్‌కో ఉంది. మొత్తం ప్రాజెక్టును 2028 జనవరి నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంగా నిర్దేశించుకుంది.

**అక్టోబరు నాటికి దిగువ సీలేరు యూనిట్లు అందుబాటులోకి :** దిగువ సీలేరు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 115 మెగావాట్ల సామర్థ్యంతో మరో రెండు యూనిట్లను జెన్‌కో నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు ప్రస్తుత సామర్థ్యం 460 మెగావాట్లుగా ఉంది. రెండు దశల్లో 115 మెగావాట్లు చొప్పున నాలుగు యూనిట్లను వీటిని ఏర్పాటు చేశారు. నిర్మాణంలో ఉన్న రెండు యూనిట్లు కూడా పూర్తయితే మొత్తం 690 మెగావాట్లకు చేరుకుంటుంది. నిర్మాణంలో ఉన్న రెండు యూనిట్లు ఈ ఏడాది జూన్‌లో ఒక యూనిట్, అక్టోబరు నాటికి మరో యూనిట్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఈ కేంద్రంలో యూనిట్‌కు సగటు వ్యయం రూ. 1.60 మాత్రమే ఉండటం విశేషం. ఏడాదంతా నీటి లభ్యత ఉండే ఈ విద్యుత్ కేంద్రానికి అదనంగా రెండు యూనిట్లు రావడం వల్ల డిస్కమ్‌లపై విద్యుత్ కొనుగోలు భారం గణనీయంగా తగ్గి ఆర్థికంగా వినియోగదారులకు కొంత ఊరటనిచ్చే అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టు వల్ల ఏడాదికి రూ. 647 కోట్ల మేర ఆదా సాధ్యమని అధికారులు చెబుతున్నారు.

# వైసీపీ నేతల్లారా.. ఇకనైనా తప్పుడు ప్రచారాలు ఆపండి: మంత్రి జనార్దన్ రెడ్డి..



నంద్యాల (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆలయాల అభివృద్ధిపై వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. ఇలాంటి పనులు చేడయం వల్లే దేవుడు వారిపై ఆగ్రహించారని.. అందుకే 11 సీట్లు ఇచ్చి ఇంట్లో కూర్చొపెట్టారని అన్నారు. ఆదివారం బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఈ సందర్భంగా పలు అభివృద్ధికి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రూ. 5.08 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. భక్తుల సౌకర్యార్థం రూ. 3.30 కోట్ల వ్యయంతో 16 గదులు, రెండు డార్మిటరీలు, 8 షాపులు నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. అలాగే రూ. 1.25 కోట్లతో నిత్యాన్నదాన సత్రం, రూ. 29 లక్షలతో లడ్డూ పోటు, రూ. 24 లక్షలతో దేవస్థానం ప్రాంగణంలో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ..'ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. యాగంటి ఉమామహేశ్వర ఆలయ నిధులను గత ప్రభుత్వంలా దుర్వినియోగం చేయకుండా కొత్త కమిటీ సద్వినియోగం చేస్తోంది. 2025 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు స్వామివారికి రూ. 5.57 కోట్ల ఆదాయం వచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో 2021 నుంచి 2024 వరకు రూ. 7 కోట్ల ఆదాయం వచ్చింది.. కానీ ఆ సొమ్ముకు లెక్కాపత్రం లేదు. నేడు స్వామివారి ఆదాయంతో మేము చేస్తున్న అభివృద్ధి కళ్ల ముందు కనపడుతోంది. గత ప్రభుత్వంలో స్వామివారి ఆదాయం ఎక్కడికి పోయినట్లు?.. ఆలయ ఆదాయ వనరులు ఏం చేసినట్లు?.. భగవంతుడికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాటి పాలకమండలపై ఉంది.

ఇప్పటికే సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశాం. నేడు వైసీపీ నేతలు పార్కింగ్ స్థలం ఏర్పాటుపైనా కోర్టులో పిటిషన్ వేయడం దుర్మార్గం. అటవీ భూమి కొల్లగొడుతున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. మేము ప్రజల కోసం పని చేస్తుంటే విమర్శలు చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా పని చేస్తున్న అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇప్పటికే దేవుడు మీ అంతు చూసి ఇళ్లలో కూర్చోబెట్టాడు. కూటమి ప్రభుత్వంలో ఎవరిపై ఎటువంటి చర్యలు తీసుకోవాలో మాకు తెలుసు. మీరు నిజంగా ప్రజలకు సేవ చేయాలంటే సొంత నిధులతో సేవ చేయాలి.

దోచుకోవడం దాచుకోవడం ఇదే వైసీపీ నేతల పని. యాగంటిలో జరుగుతున్న అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారు. అభివృద్ధి జరిగితే మీకు నొప్పేంటి?. సొంత నిధులతో అభివృద్ధి చేసి మాతో పోటీ పడండి. కక్ష సాధింపు వైఖరి మానుకోవాలి. ఆలయ అభివృద్ధికి సలహాలు, సూచనలకు మాత్రమే మేము పరిమితమయ్యాం. దేవాలయంలో రాజకీయాలకు వ్యతిరేకం. వ్యక్తిగతంగా ఎప్పుడూ ఆలయంలో ఆధిపత్యం కోసం ప్రయత్నించలేదు. త్వరలో ఈ అభివృద్ధి కార్యక్రమాలు అన్ని పూర్తి చేసి ప్రజలకు అంకితం ఇస్తాం' అని హామీ ఇచ్చారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ ఎన్నిక

- **పదవీవిరమణ వయస్సు 62కు పెంపు డిమాండ్**



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** స్టేట్ గవర్నమెంట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ జేఏసీ అమరావతి అనుబంధం) రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం శనివారం విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్ సమీపంలోని ఐఎంఏ హాల్లో కే. సుమన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 17 మందితో నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి టి.వి. ఫణి పేర్రాజు వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్ర అధ్యక్షుడిగా గంటా సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇ. మోహన్ రావు, ఖజాంచిగా సిహెచ్ రమణ మూర్తి ఎన్నికయ్యారు. అలాగే 13 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కే. సుమన్‌ను గౌరవాధ్యక్షుడిగా కొనసాగించాలని సమావేశం తీర్మానించింది.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బంది తక్కువ వేతనాలతో క్రమశిక్షణగా సేవలందిస్తున్నారని తెలిపారు. వారికి పదవీవిరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే సంక్షేమ పథకాలు అమలు చేయడం, సీనియర్ ఉద్యోగులకు ఇంక్రిమెంట్ల విధానం ప్రవేశపెట్టడం అవసరమన్నారు.

అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు మాట్లాడుతూ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల హక్కుల కోసం ప్రత్యేక వ్యవస్థలు ఉన్నప్పటికీ, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఔట్సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు కూడా అందడం లేదని విమర్శించారు. హైకోర్టు తీర్పును దృష్టిలో ఉంచుకుని 'సమాన పనికి సమాన వేతనం' అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా విభాగం చైర్‌పర్సన్ పారె లక్ష్మీ మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తక్కువ జీతాలతో పనిచేస్తున్న వారికి సంక్షేమ పథకాలు నిలిపివేయడం బాధాకరమని, ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.

నూతన రాష్ట్ర అధ్యక్షుడు గంటా సంపత్ కుమార్ మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఇ. మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరిపి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

సమావేశంలో వివిధ శాఖలకు చెందిన ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# గుంటూరు మార్పుకు శ్రీకారం చుట్టిన యువత

- **ప్రణాళిక రూపకల్పనలో పౌర సంస్థలు**




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు మార్పుకు నడుం బిగించిన వందలాది యువతీ, యువకులు ఈనెల 12వ తేదీ ఆదివారం గుంటూరులోని టి.జె.పి.ఎస్. కళాశాల ఆడిటోరియంలో నగరం ఎదుర్కొంటున్న పారిశుధ్యం, ట్రాఫిక్, విద్య, వైద్య రంగాలలో గల సమస్యల పరిష్కారం కోసం 7 బృందాలుగా ఏర్పడి చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సేవాతత్పరులు, ప్రముఖ వ్యాపారవేత్త త్రిపుర మల్లు అరుణ్ కుమార్ ప్రసంగిస్తూ కనెక్ట్ అనే పేరుతో గుంటూరు నగరంలో పనిచేస్తున్న పలు పౌర సంస్థల యువతీ, యువకులను ఐక్యపరిచి నిర్మాణాత్మకమైన కార్యాచరణతో ముందుకు పయనిద్దామని పిలుపునిచ్చారు. గుంటూరులో దాతృత్వం గల వారిని ఎంపిక చేసి నగర అభివృద్ధిలో భాగస్వామ్యులను చేసే దిశగా కృషి జరుపుతామన్నారు. వుయ్ ఆర్ విత్ యు వ్యవస్థాపకులు సిగనం అయ్యప్ప ప్రసంగిస్తూ 6 సంవత్సరాలు క్రితం ఏర్పాటైన తమ సంస్థ అనితి కాలంలోనే 2 వేల మంది యువతీ, యువకులను వాలంటీర్లుగా నమోదు చేసుకుని ప్రతిభ గల 85 మంది పేద, అనాథ విద్యార్థులను దత్తత తీసుకుని అత్యున్నత విద్యను అందించే స్థితికి చేరుకున్నామని తెలిపారు. భారతదేశం ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా పురోగతి సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఆ వైపు అడుగులు వేస్తున్నామని సభా ముఖంగా ప్రకటించారు. చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 1990వ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి జిల్లా నుండి దాదాపు 50 వేల మంది యువత స్వచ్ఛంద కార్యకర్తలుగా అక్షర కేంద్రాలను నిర్వహించి లక్షలాది మంది నిరక్షరాస్యుల జీవితాలలో అక్షర వెలుగులను అందించారని తద్వారా 17 శాతం అక్షరాస్యతలో వృద్ధిని సాధించగలిగామని తెలిపారు. నేడు గుంటూరులో మానవత్వం సేవాతత్వరత గల యువత ఏకత్రాటి పైకి వచ్చి నగర అభివృద్ధిపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. టిజెపిఎస్ కళాశాల సెక్రటరి కె.వి బ్రహ్మం ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి సమాజం నుండి లబ్ధి పొంది వృద్ధి సాధించిన తర్వాత సమాజానికి తిరిగి ఇవ్వడం ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమౌతుందని పేర్కొన్నారు. నగరంలో ఏ మంచి కార్యక్రమానికైనా టిజెపిఎస్ కళాశాల పూర్తిగా సహకరిస్తుందన్నారు. కార్మెల్ సేవాసదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకాస్ ప్రసంగిస్తూ గత మూడు దశాబ్దాలుగా మానసిక వైకల్యం గల 250 మంది మహిళలకు పొన్నూరులో 80 మంది పురుషులకు గుంటూరులో భోజన, వసతి తో పాటు వైద్య సదుపాయాన్ని కార్మెల్ సేవా సదన్ కల్పిస్తుందని వివరించారు. ఆపదలో ఉన్న వారికి సహాయ పడటం యువత లక్షణంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, మానవత చైర్మన్ పావులూరి రమేష్, టి. సుందర రామయ్య, కోవిడ్ ఫైటర్స్ పఠాన్ ముజీబ్, అభినందన ఫౌండేషన్ కె. దినేష్కుమార్ , కళాభారతి అంధుల పాఠశాల రవీందర్ రెడ్డి, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ దుర్గాప్రసాద్, కొండయ్య, టిజెపిఎస్ కళాశాల ఎన్ సి సి ఆఫీసర్ కుమార్ రాజా, తుపాకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# బెట్టింగ్, జూద కార్యకలాపాలపై కఠిన చర్యలు.. డీజీపీ వార్నింగ్



(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈరోజు(ఆదివారం) డీజీపీ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ నేపథ్యంలో ఏపీవ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్, జూద కార్యకలాపాల నిరోధంపై జీరో టోలరెన్స్ విధానంతో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు.

**బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై ముమ్మర దాడులు.. :** రాష్ట్రవ్యాప్తంగా బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై దాడులు ముమ్మరం చేశామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా ఉన్న పలు క్లబ్‌లను మూసివేశామని చెప్పుకొచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లను గుర్తించామని అన్నారు. సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ బ్లాక్ చేసే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బుకీలు, ఏజెంట్లు, బెట్టింగ్‌లో పాల్గొనే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేరాలను ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా పరిగణించి బీఎన్ఎస్ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నామని వెల్లడించారు. బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను ఇప్పటికే గుర్తించి ఫ్రీజ్ చేస్తున్నామని అన్నారు.

**ఆస్తులను చట్టప్రకారం అటాచ్ చేస్తాం.. :** చట్టాలను ఉల్లంఘిస్తూ పదే పదే గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నేరస్తులపై ప్రివెంటివ్ డిటెన్షన్, చర్యలు తీసుకోవాలని పోలీసులకు డీజీపీ ఆదేశించారు. బెట్టింగ్ ద్వారా సంపాదించిన, ఉపయోగిస్తున్న ఆస్తులను గుర్తించి చట్ట ప్రకారం అటాచ్ చేస్తామని తెలిపారు. ఐపీఎల్ సందర్భంగా ఏపీ వ్యాప్తంగా లాడ్జీలు, హోటళ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు కొనసాగుతున్నాయని వివరించారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లపై నిరంతర నిఘా పెట్టామని చెప్పారు. యువతకు బెట్టింగ్ వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. బెట్టింగ్, జూదాలకు ప్రజలు దూరంగా ఉండాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా విజ్ఞప్తి చేశారు.

# 'నారి శక్తి వందనం'తో చట్ట సభల్లో మహిళలకు ప్రాధాన్యత



(మొదటి పేజీ తరువాయి)

భోగాపురం ప్రాజెక్టును ఐదేళ్ల నిర్లక్ష్యం చేసి ఇప్పుడు తమదేనని చెప్పడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ పశ్చిమ బెంగాల్, తమిళనాడులో పాలన మార్పు అవసరమని పేర్కొన్నారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో తెలుగు ప్రజలు ఉన్న చోట కూటమి అగ్రనేతలు ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ శాసనసభ పక్షనేత పి. విష్ణుకుమార్ రాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు సిహెచ్ పట్టాభి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి యు. సుజాత రాజ్, మహిళా నేతలు ఎన్. జ్యోతి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయిల చెల్లింపు హర్షనీయం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిల చెల్లింపును "రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్" హర్షణీయంగా అభివర్ణించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రాచ్యుటీ, లీవ్ ఎంకాష్మెంట్ బకాయిలను చెల్లించినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆర్థికంగా ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు.

అలాగే, 2022 నుండి సేవలో ఉన్న ఉపాధ్యాయుల సరెండర్ లీవ్ బిల్లులను కూడా వెంటనే చెల్లించాలని ప్రభుత్వం వద్ద ఆయన విజ్ఞప్తి చేశారు. 11వ పీఆర్సీ కాలం ముగిసి ఇప్పటికే 33 నెలలు దాటిపోయిన నేపథ్యంలో, తక్షణమే కొత్త పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఇంటరిమ్ రిలీఫ్ (ఐఆర్) ప్రకటించాలని కోరారు.

# పూలే ఆశయాలు సమాజానికి మార్గదర్శకం



**విశాఖపట్నం, (జర్నలిస్ట్ ఫైల్):** మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. ధర్మరాజు, అకౌంట్స్ ఆఫీసర్ మధు తదితరులు హాజరై పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పూలే సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి అపారమని తెలిపారు. బాలికల విద్యకు పునాది వేసి సమాజంలో మార్పుకు నాంది పలికారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన దారి నేటికీ ప్రాసంగికమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా విద్యలో అసమానతలు కొనసాగుతున్నాయని, పూలే ఆశయాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ వెబ్‌సైట్ ప్రారంభం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన "ఏపిజిడిఏ డాట్ కామ్" వెబ్‌సైట్‌ను గుంటూరులోని జీజీహెచ్ సుశృత హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. జయధీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. రమేష్ మాట్లాడుతూ, అసోసియేషన్ చరిత్రలో ఇదే తొలిసారి వెబ్‌సైట్‌ను రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ వెబ్‌సైట్ ద్వారా సభ్యుల వివరాలు, సిఎంఈ కార్యక్రమాలు, వైద్యుల సమస్యలు, ప్రభుత్వం విడుదల చేసే జీఓలపై తాజా సమాచారం అందించనున్నట్లు చెప్పారు. అలాగే వైద్యుల సేవలకు సంబంధించిన అంశాలను కూడా ఇందులో పొందుపరిచినట్లు వివరించారు.
అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన ఈ వెబ్‌సైట్‌ను సభ్యుల సమక్షంలో ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి వైద్యుడు అసోసియేషన్ సభ్యత్వం పొందాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.
ఈ వెబ్‌సైట్‌లో తొలి సభ్యుడిగా గుంటూరు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సుజ్ఞాన్ నమోదు చేసుకున్నారు. నూతన ఐటీ వింగ్ చైర్మన్‌గా శ్రీకాకుళం గవర్నమెంట్ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. పి. రాము నియమితులయ్యారు. అలాగే నెల్లూరుకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ (ఫార్మకాలజీ) డా. మునీర్ కన్హా, ప్రొఫెసర్ (ఎస్‌పిఎం) డా. వాల్మీకి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌ఓడీ (ఆర్థోపెడిక్స్) డా. మణి కుమార్‌లను అకాడమిక్ చైర్మన్‌లుగా నియమించారు.
కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే వ్యాఖ్యలపై బీజేవైఎం ఫిర్యాదు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అస్సాం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేవైఎం నాయకులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు సూచనలతో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తుంగ యశ్వంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయితీ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాసుకు ఫిర్యాదు అందజేశారు.
ఈ సందర్భంగా చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ 'సబ్కా సాత్, సబ్కా వికాస్' సిద్ధాంతంతో బీజేపీ అందర్నీ కలుపుకుపోతున్న ఈ సమయంలో హిందూ-ముస్లిం సమాజాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా చేసిన వ్యాఖ్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.
తుంగ యశ్వంత్ మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయవాద భావాలను పెంపొందించే ఆర్ఎస్ఎస్‌పై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సేవలందించిన విషయాలను గుర్తుచేస్తూ, సమాజంలో విభేదాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.
ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా నాయకులు కొచ్చర్ల దుర్గ, గణ, ఆనంద్, రాధాకృష్ణ, స్వప్న, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరక కుమార్ గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రావూరి లక్ష్మీనారాయణశర్మ, నాయకులు శ్రీను నాయక్, అబ్రహం, కామేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెనాలిలో అన్నమయ్య పాటల పోటీలు



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** తాళ్ళపాక అన్నమాచార్యుల 618వ జయంతి సందర్భంగా ఈ నెల 26న తెనాలిలో అన్నమయ్య పాటల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో నెహ్రూ రోడ్డులోని గోవర్ధనస్వామి దేవస్థానం (పెద్ద ఆంజనేయ స్వామి దేవస్థానం) వద్ద ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరగనున్నాయి.
పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 20లోపు తమ పేరు, వయసు, ఫోన్ నంబర్‌ను 9246440685కు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.
పోటీలను నాలుగు విభాగాలుగా నిర్వహించనున్నారు. జూనియర్-1 (8-13 సంవత్సరాలు), జూనియర్-2 (14-20 సంవత్సరాలు) విభాగాల్లో మొదటి బహుమతి 1000 రూపాయలు, రెండో బహుమతి 500 రూపాయలు, మూడో బహుమతి 300 రూపాయలు ఇవ్వనున్నారు. అదనంగా పది కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేయనున్నారు.
సీనియర్-1 (21-35 సంవత్సరాలు), సీనియర్-2 (36--60 సంవత్సరాలు) విభాగాల్లో మొదటి బహుమతి 500 రూపాయలు, రెండో బహుమతి 300 రూపాయలు, మూడో బహుమతి 200 రూపాయలు ఇవ్వనున్నారు. పాల్గొన్న వారందరికీ అన్నమాచార్యుల చిత్ర మెమెంటోలు అందజేస్తారు.
వృత్తిపరమైన గాయకులకు ఈ పోటీలు వర్తించవని, అన్నమయ్య సంకీర్తనల ప్రచారమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో అందె బాలచంద్రమౌళి, ఎం. కోటేశ్వరరావు, ఎన్. పాపిరెడ్డి, చందోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రాతస్మరణీయులు : మంత్రి కందుల దుర్గేష్

- **కొవ్వూరులో ఘనంగా డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ**
- **పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**



**కొవ్వూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 14వ తేదీన భారత రాజ్యాంగ రూపశిల్పి డా. బి.ఆర్ అంబేద్కర్ జయంతిని జరుపుకుంటారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.. కొవ్వూరు నియోజకవర్గం మద్దూరు లంక గ్రామంలో నూతనంగా నిర్మించిన డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దేశాల ముందు భారతదేశం సగర్వంగా తల ఎత్తుకునేలా చేసిన మహోన్నత మేధావి డా. బి.ఆర్. అంబేద్కర్ అని, ఆయన మనందరికీ ప్రాతస్మరణీయులని కొనియాడారు. దళితులు, వెనుకబడిన వర్గాలు మరియు మహిళలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించిన వ్యక్తి అంబేద్కర్ అని పేర్కొన్నారు. దళితులు అణగదొక్కబడే వారు కాదని, వారు ఆత్మగౌరవంతో, ధైర్యంతో జీవించే శక్తి ఉన్నవారని, అంబేద్కర్ విగ్రహం ఆ తరహా ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని అభివర్ణించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు గ్రామంలో ఎంపీ తో చర్చించి కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు తగిన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనేక ఉద్యమాల ద్వారా ప్రజల పక్షాన నిలుస్తున్న యువ నాయకుడు జీవి శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ జై భీమ్ అని నినదించారు.
ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, భారీ సంఖ్యలో ప్రజలు మరియు అంబేద్కర్ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఏప్రిల్ 14న రాబోయే అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ విగ్రహావిష్కరణ జరగడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# నిర్మల కాలేజ్ ఆఫ్ ఫా.ర్మసీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** సమీపంలోని ఆత్మకూరు లోని నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రముఖ హెల్త్ కేర్ సర్వీస్, కన్సల్టింగ్ సంస్థ ఇంఫ్లోక్యూరీస్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (కేసరపల్లి, గన్నవరం) ఆధ్వర్యంలో శుక్రవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించారు.
కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.
సంస్థ డిప్యూటీ మేనేజర్ రోకడీ దీపక్ లక్ష్మణ్, హెచ్ఆర్ నాగ సాయి కృష్ణ విద్యార్థులతో మాట్లాడి సంస్థలో లభించే ఉద్యోగ అవకాశాలు, బాధ్యతలు, వేతన విధానం, అర్హతలు, సెలవుల విధానం గురించి వివరించారు. అర్హత సాధించిన అభ్యర్థులకు హెల్త్ కేర్ సర్వీస్, కన్సల్టింగ్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి వచ్చే ఏడు రోజుల్లో ఈమెయిల్ ద్వారా అపాయింట్‌మెంట్ లెటర్లు పంపనున్నట్లు వెల్లడించారు.
ఈ కార్యక్రమానికి స్వాగత ప్రసంగాన్ని ఎం. ప్రశాంతి అందించారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మొత్తం 76 మంది బి. ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు హెల్త్ కేర్ కన్సల్టింగ్ రంగంలో అవకాశాలు కల్పించడంలో ఈ కార్యక్రమం ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.
కార్యక్రమాన్ని ప్లేస్‌మెంట్ టీమ్ సభ్యులు ఎం. ప్రశాంతి, వి. జోజిబాబు, సి. హెచ్. భర్గవ గోపి సమన్వయం చేశారు.

# స్త్రీ శక్తికి బీజేపీ అందిస్తున్న గౌరవం... మహిళా రిజర్వేషన్ బిల్లు



- **రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి**

**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందుతుందని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి చెప్పారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడతారని తెలిపారు. దేశంలో సగభాగం మహిళలు ఉన్న ఇప్పటివరకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించలేదన్నారు.
కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో త్వరలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదయోగ్యం లభించడం సంతోషకరమైన విషయం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దేశ మహిళల తరఫున పురందేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించారు. మహిళలు రాజకీయాల్లోకి మరింత చురుగ్గా రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేరళ ఎన్నికల్లో బీజేపీకి సీట్లు, ఓట్లు పెరగనున్నాయని పురందేశ్వరి తెలిపారు. కూటమి మహిళా నాయకులతో కలిపి రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడారు. దేశ చరిత్రలో మహిళా రిజర్వేషన్ బిల్లు- నారీశక్తి వందన్ అధినీయం ఆమోదం పొందడం ఒక చారిత్రాత్మక ఘట్టమని, ఇది మహిళా లోకానికి ప్రధాని మోదీ అందించిన గొప్ప వరమని కొనియాడారు. సెప్టెంబర్ 2023లో కొత్త పార్లమెంట్ భవనంలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు, స్త్రీ శక్తికి దక్కిన గౌరవమని పురందేశ్వరి పేర్కొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్ట



**ఖాజీపేట (జర్నలిస్ట్ ఫైల్):** కాజీపేట మండలం కొత్తపేట గ్రామంలో గ్రామీణ అభివృద్ధికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు గ్రామ మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడే ఈ పనులు ప్రజల్లో కొత్త ఆశలను నింపాయి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో సుమారు 20 లక్షల వ్యయంతో స్మశానవాటికను ప్రారంభించారు గ్రామ ప్రజలకు అవసరమైన ముఖ్య సదుపాయాలలో స్మశాన వాటిక ఒకటిని ఇది అందుబాటులో రావడం ద్వారా ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిందని ఆయన తెలిపారు అదే విధంగా సుమారు 35 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు కూడా ప్రారంభించారు ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు అలాగే ఉపాధి హామీ నిధుల కింద 42 లక్షల విలువైన మెటల్ రోడ్డు ని కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు ఈ రహదారి ద్వారా గ్రామానికి చేరుకోవడం మరింత సులభతరం అవుతుందని తెలిపారు ఈ అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు జయ జయ ద్వానాలతో హర్ష ధ్యానాలతో గ్రామం మొత్తం ఉత్సాహ భరిత వాతావరణంలో మార్మోగింది ప్రజల ప్రేమాభిమానాలు ఎమ్మెల్యే పట్ల ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించాయి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ నాయకులకు కృషిని ప్రత్యేకంగా అభినందించారు ప్రభుత్వ నిధులను సమర్ధవంతంగా వినియోగించి అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు గ్రామస్థాయిలో నాయకత్వం బలంగా ఉంటేనే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు గ్రామ అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే ప్రతి గ్రామంలో రోడ్లు, స్మశానవాటికలు మౌలిక వసతులు అభివృద్ధి చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే తన ధ్యేయమని తెలిపారు భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామ టిడిపి నాయకులు ఎమ్మెల్యేని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు గ్రామ పెద్దలు మహిళలు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదంలా వైసీపీ రాజకీయాలు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న రాజకీయ విధానాలపై మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదంలా తయారయ్యాయని ఆయన మండిపడ్డారు. "చంపుతాం, నరుకుతాం, అంతు చూస్తాం" అనే రీతిలో బెదిరింపులకు దిగడమే వైసీపీ శైలి అని, విధ్వంసం తప్ప ఆ పార్టీకి మరో ఎజెండా లేదని ధ్వజమెత్తారు. వైసీపీ ఇప్పుడు ఒక రాజకీయ పార్టీలా కాకుండా 'గొడ్డలి పార్టీ'గా మారిందని మంత్రి నిమ్మల విమర్శించారు.
**ఎవరు అడ్డొచ్చినా... :** రాజకీయంగా తనకు ఎవరు అడ్డొచ్చినా వారిని అడ్డుతొలగించుకోవడమే జగన్ నైజమని నిమ్మల ఆరోపించారు. ఆఖరికి సొంత బాబాయ్ అయినా, బయటి వారైనా సరే.. తన అధికారం కోసం ఎవరినైనా అంతం చేయడానికి జగన్ వెనుకాడరని ఆయన విమర్శించారు. వినాశనం పునాదుల మీద రాజకీయం చేస్తున్న వైసీపీ నాయకత్వం వల్ల రాష్ట్రానికి ముప్పు పొంచి ఉందని మంత్రి నిమ్మల హెచ్చరించారు.

# ఒంటిపూట బడులు ఉదయం 11 గంటల వరకే నిర్వహించాలి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో రోజురోజుకీ పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ఒంటిపూట బడులను ఉదయం 11 గంటలకే ముగించాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్‌పీటీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షఫీ విద్యాశాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.
ప్రస్తుతం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 43 నుంచి 45 డిగ్రీల మధ్య నమోదవుతున్న నేపథ్యంలో విద్యార్థులు తీవ్ర ఎండ వేడిమి, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో సోమవారం నుంచి ఒంటిపూట బడులను ఉదయం 11 గంటల వరకే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు.

# ఆశా భోంస్లే కీర్తి అజరామరం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ గాయని, సంగీత ప్రపంచంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆశా భోంస్లే కన్నుమూశారు. ఆమె మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆశా భోంస్లే మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. " ప్రముఖ గాయని ఆశా భోంస్లే జీ ఇక లేరన్న వార్త విని నేను తీవ్ర దిగ్భ్రాంతికి, బాధకు గురయ్యాను. భారత సంగీత ప్రపంచంలో ఆమె ఒక దిగ్గజం. ఆమె లాంటి విలక్షణమైన, వైవిధ్యమైన గాయని మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలోనే అత్యధిక పాటలు పాడిన కళాకారిణిగా చరిత్రలో నిలిచిపోయిన ఆమె కీర్తి అజరామరం. ఏడు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె సంగీత ప్రస్థానం అసాధారణమైనది. ఆమె పాడిన పాటలు ఎన్నో తరాలను ఉర్రూతలూగించాయి, మనందరి జీవితాల్లో భాగమైపోయాయి. ఆమె గాత్రంలోని మాధుర్యం, భావం మరపురానివి. పద్మవిభూషణ్ వంటి అత్యున్నత పురస్కారం ఆమె ప్రతిభకు ఒక చిన్న గుర్తింపు మాత్రమే. భారతదేశ సంగీత వారసత్వంలో ఆమె స్థానం ఎప్పటికీ పదిలంగా ఉంటుంది. ఆమె పాటల రూపంలో మన మధ్యే చిరస్థాయిగా జీవించి ఉంటారు. ఈ విషాద సమయంలో, ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అభిమానులకు నా తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను " అంటూ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

# ఉత్తమ ఆస్ట్రోజమాలజిస్ట్ అవార్డు అందుకున్న మాలిక్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** క్రైట్ క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ అంతర్జాతీయ సంస్థ 2026 సంవత్సరానికి అందించే అంతర్జాయ బిజినెస్, ఎడ్యుకేషన్ అవార్డు ఫంక్షన్ లో తెనాలి పట్టణానికి చెందిన, యువ క్రికెట్ అకాడమి వ్యవస్థాపకులు మాలిక్ ఉత్తమ ఆస్ట్రో జమాలజిస్ట్ అవార్డు అందుకున్నారు. న్యూ ఢిల్లీలోని హోటల్ హయాక్ సెంట్రిన్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం రాత్రి నిర్వహించిన, అవార్డుల ప్రధానోత్సవ సభలో, చైన్నై సూపర్ కింగ్స్, ఫేమస్ క్రికెటర్ సురేష్ రైనా చేతులమీదుగా మాలిక్, ఉత్తమ ఆస్ట్రో జమాలజిస్ట్ అవార్డును అందుకోవడం పట్ల, పట్టణంలోని మాలిక్ అభిమానులు, శ్రేయోభిలాషులు హర్షం వెలిబుచ్చారు.

# కీర్తన కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



**అగ్రహారం, ఖాజీపేట (జర్నలిస్ట్ ఫైల్) :** కాజీపేట మండలం అగ్రహారంలో రెండు రోజుల క్రితం దారుణ హత్యకు గురైన కీర్తన కుటుంబాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తన నివాసానికి వెళ్లి పరామర్శించడం జరిగింది. విద్యార్థి కీర్తనను గొంతు కోసి చంపడం దుర్మార్గం బాధాకరం నా మనసు కలిసి వేసింది నా నియోజకవర్గంలో ఇలా ఎప్పుడు జరగలేదు. మరోసారి జరగకుండా గట్టి చర్యలు చేపడతాం. భవిష్యత్తులో ఎటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నారా లోకేష్ ఆదేశించడం జరిగింది. ఈ క్రమంలో ఈ కేసులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బాధ్యత కుటుంబానికి మేము మా పార్టీ అండగా ఉంటుందని బాధ్యత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తామని నినుతురికి శిక్ష పడేలా పోలీస్ యంత్రాంగం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని నిందితుడికి త్వరితగతిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని బాధ్యత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే పుట్ట తెలిపారు.

# 15న తిరుపతిలో నూతన క్రికెట్ స్టేడియం ప్రారంభం

**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో తిరుపతి గోలవనిగుంటలో నిర్మించిన నూతన క్రికెట్ స్టేడియం ఈ నెల 15న ప్రారంభం కానుంది. రాష్ట్ర విద్య, మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి నారా లోకేశ్ సాయంత్రం 4 గంటలకు స్టేడియాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీ-2025లో క్రీడా కోటా ద్వారా నియమితులైన అభ్యర్థులను కార్యక్రమానికి ఆహ్వానించినట్లు శాప్ అధికారులు తెలిపారు. క్రీడా అభివృద్ధికి తోడ్పడటం, భవిష్యత్ క్రీడాకారులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గోలవనిగుంటలోని క్రికెట్ స్టేడియంలో ఏప్రిల్ 15న ఉదయం 9 గంటలకు ముందుగా హాజరుకావాలని సూచించారు.

# యువతకు సన్మార్గం చూపే క్రీడలు



**- రాయికల్‌లో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం**

**రాయికల్, ఏప్రిల్12(జర్నలిస్ట్ ఫైల్):** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారు సరైన దిశలో ముందుకు సాగాలంటే క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని రాయికల్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ పురె శ్రీధర్ అన్నారు. మహాత్మ జ్యోతిరావ్ పూలే-- డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ఆవరణలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాయికల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు, విద్యార్థులు మొబైల్ ఫోన్ వ్యసనానికి గురికాకుండా ఉండేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే పరిమితం కాకుండా మానసిక ధైర్యం, క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందిస్తాయని వివరించారు.పట్టణ అధ్యక్షులు గుర్రం రత్నాకర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావ్ పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల ఆదర్శాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి మారంపెల్లి సాయికుమార్ మాట్లాడుతూ మైదానంలో చెమటోడ్చే యువతే జీవితంలో విజయం సాధిస్తారని, క్రీడల వైపు మళ్లిన వారు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు.తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు-ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో పోటీ పడటమే నిజమైన విజయమని చెప్పారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు పురె శ్రీనివాస్ క్రీడల నిర్వహణకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాపురపు నర్సయ్య, సందెల రాజేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు బందెల శ్రీనివాస్, పురె రమేష్, ప్రతాప్, రాజేందర్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# "సమానత్వ సమాజమే అంబేద్కర్ ఆశయం"



**- ఆత్మ జిల్లా అధ్యక్షులు కాటిపెల్లి గంగారెడ్డి**

**రాయికల్, ఏప్రిల్12(జర్నలిస్ట్ ఫైల్):** రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ముందస్తు అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఆత్మ జిల్లా అధ్యక్షులు కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉపసర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, విడిసి చైర్మన్ అనుపురం లింబాద్రి గౌడ్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాకుండా ఒక ఉద్యమం, ఒక ఆలోచన, ఒక సామాజిక విప్లవమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అపారమని, కుల వివక్ష, అంటరానితన నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు."విద్య నేర్చుకోండి, సంఘటితమవండి, పోరాడండి" అనే అంబేద్కర్ సందేశం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని, దేశ అభివృద్ధి ప్రజల విద్య, సమానత్వంపై ఆధారపడి ఉంటుందని వివరించారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించి ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయంకల్పించిన మహనీయుడిగా ఆయన నిలిచారనిఅన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు,గురువులు,పెద్దలపట్ల గౌరవం కలిగి ఉండాలని, విలువలతో కూడిన విద్యను అభ్యసించి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని తెలిపారు. అనంతరం విద్యార్థులు అంబేద్కర్ పై పాటలు, ఉపన్యాసాలు అందించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిరాణి, ఆర్.యు.పి.పి జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్,ఎద్దండి రమేష్, హన్మంతరావు, జియావుద్దీన్,ముజాహిద్,స్వర్ణలత, శ్రీలత,నీరజ, నాగలక్ష్మి, సమత,కవిత, లక్ష్మణ్, రాజం తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భౌతిక కాయని సందర్శించి నివాళ్ళు అర్పించిన ఎమ్మెల్యే జారే



**దమ్మపేట, ఏప్రిల్12(జర్నలిస్ట్ ఫైల్):** అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం జమేదార్ బంజర గ్రామంలో మాజీ సర్పంచ్ కుంజా సూరిబాబు అమ్మ అనారోగ్యంతో మరణించగా స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పరామర్శించారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఆధునిక ల్యాబ్ ప్రారంభం





**బెల్లంపల్లి, ఏప్రిల్12(జర్నలిస్ట్ ఫైల్):** బెల్లంపల్లి మండలంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన ఆధునిక ల్యాబ్, తరగతి గదులను శనివారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ప్రారంభించారు. రూ.2.30 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో కీలకంగా మారనున్నాయని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ విద్యార్థులకు పట్టణ స్థాయి సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు. ఆధునిక పరికరాలతో ఏర్పాటైన ల్యాబ్ విద్యార్థుల్లో ప్రాయోగిక జ్ఞానాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు.కొత్తగా నిర్మించిన తరగతి గదులు విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని కల్పిస్తాయని తెలిపారు. ఏడాది నర క్రితం భూమిపూజ చేసిన ఈ భవనం తక్కువ కాలంలోనే పూర్తి కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డిఇఓ, ప్రిన్సిపాల్, అధికారులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిఎం కార్యాలయంలో మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



**రామ్‌మందిర్ ఏరియా ఏప్రిల్12 (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరిఖని లో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఆర్జీ-1 ఏరియా జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జీ-1 ఏరియా ఇంచార్జి జి.యం కె.చంద్రశేఖర్ హాజరై కేక్ కట్ చేసి, మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు.అదేవిధంగా బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్జీ-1 పరిధిలోని జిడికె గనులు (1ఇ3, 2ఇ2ఎ, 11 ఇంక్లైన్), ఓసి-5 ప్రాజెక్ట్‌తో పాటు అన్ని విభాగాలలో జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా జి.యం కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే ఒక గొప్ప సామాజిక సంస్కర్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడు అని తెలిపారు. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మాలి కులానికి చెందిన కుటుంబంలో 1827 ఏప్రిల్ 11న జన్మించిన ఆయన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు.అణగారిన వర్గాలు, మహిళలకు విద్య అందించడంలో పూలే చేసిన సేవలు అమోఘమని తెలిపారు. 1848లో పుణేలో బాలికల కోసం దేశంలోనే మొదటి పాఠశాలను ప్రారంభించడం ఆయన గొప్ప సేవగా పేర్కొన్నారు. తన భార్య సావిత్రీబాయిని చదివించి, దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తుచేశారు.అంటరానితన నిర్మూలనకు పూలే చేసిన కృషి ఆదర్శనీయమని, సమాజంలో సమానత్వం కోసం ఆయన పోరాటం నేటికీ ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులకు పూలే ఆలోచనలు మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. 1890 నవంబర్ 28న ఆయన మరణించినప్పటికీ, ఆయన ఆశయాలు నేటికీ ప్రజలకు మార్గదర్శకంగా ఉన్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 ఏరియా ఇంచార్జి జి.యం కె. చంద్రశేఖర్, ఆర్జీ రీజియన్ క్వాలిటీ జి.యం సుజోయ్ మజుందర్, బీసీ లైజన్ అధికారి పెరుమాళ్ళ శ్రీనివాస్, ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బీసీ ఇ ఓబీసీ సెక్రటరీ బత్తుల పోషం, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ రామమోహనరావు, ఓసి-5 ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు మరియు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాజీపేట మండలం రంగాపురం చెందిన కీర్తన హత్య కేసు నిందితుడు వెంకటేష్ చేతిలో గాయపడ్డ పోలీసులు



**(జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా కాజీపేట పోలీసులను పరామర్శించిన కడప జిల్లా ఎస్పీ నచికిత్ విశ్వనాథ్..మైదుకూరు డిఎస్పీ రాజేంద్ర ప్రసాద్ డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరిన ఎస్పి.. కడప ఎస్పీ నచికిత్ విశ్వనాథ్ కామెంట్స్..కాజీపేట పోలీస్ స్టేషన్ పి సీలు శివయ్య నరసింహులు గాయపడ్డారు..కీర్తన అనే అమ్మాయిని నిందితుడు వెంకటేష్ గోరంగా మర్డర్ చేశారు..ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు కారణం..కీర్తన అనే అమ్మాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువకుడు హత్యకు పాల్పడ్డాడు..చికిత్స కోసం హాస్పిటల్‌కి వెళుతూ మార్గమధ్యంలో మరణించింది.. నిందితున్ని సురక్షిత ప్రాంతానికి తరలిస్తుండగా పారిపోయాడు..అప్రమత్తమైన కాజీపేట పోలీసులు నిందితుడు కోసం గాలించారు.నిందితుడు పోలీసులపై కత్తితో తిరగబడ్డాడు..మా పోలీసులకు ఈ ఘటనలో గాయాలయ్యాయి.. నిందితునికి పోలీసులు హెచ్చరిక జారీ చేశారు.. కానీ నిందితుడు సహకరించలేదు..కాజీపేట పోలీసులు రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు, ఒక రౌండ్ గాలిలోకి మరో రౌండ్ లో నిందితుడి కాలిపై ఫైర్ చేశారు..నిందితుడికి కాళ్ళకి గాయమై చికిత్స కోసం రిమ్స్ కు తరలించడం జరిగింది.కడప జిల్లాలో మహిళలకు ఎటువంటి నేరాలకు పాల్పడిన పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటాం.. పోలీసుల మీద తిరగబడితే ధైర్యంగా ఎదుర్కొంటాం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.. మహిళల రక్షణ రౌడీషీటర్లపై గట్టి చర్యలు పోలీసులు తీసుకుంటాం.. క్రిమినల్ లను ఎవరిని కూడా కడప పోలీసులు ఉపేక్షించరు..మృతురాలి తల్లిదండ్రులతో మాట్లాడడం జరిగింది.. నిందితునికి శిక్షపడేందుకు చర్యలు తీసుకుంటాం..ప్రభుత్వం నుండి పోలీసులనుండి ఉన్నతాధికారుల నుండి కుటుంబానికి అండగా ఉంటాం. క్రిమినల్ చర్యలకు పాల్పడితే కడప పోలీసులు కఠినమైన చర్యలు తీసుకుంటాం.

## పట్టణంలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు.



**పెద్దపల్లి, ఏప్రిల్12 (జర్నలిస్ట్ ఫైల్) :** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలో వారి విగ్రహానికి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే గారు అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహానుభావుడని పేర్కొన్నారు. 1873 సెప్టెంబర్ 24న ఆయన సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులు సాధించేందుకు నిరంతరం పోరాటం చేశారని తెలిపారు. ఈ సంఘంలో అన్ని మతాలు, కులాలకు చెందిన ప్రజలకు సమాన అవకాశాలు కల్పించబడినట్టు ఆయన వివరించారు.భారతదేశంలో సామాజిక సంస్కరణ ఉద్యమంలో జ్యోతిరావు పూలే గారు ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచారని, ఆయన తన భార్య సావిత్రిబాయి పూలే గారితో కలిసి మహిళా విద్యకు మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించడం ద్వారా మహిళా విద్యకు నాంది పలికారని గుర్తుచేశారు.అణగారిన వర్గాలు, మహిళల అభివృద్ధి కోసం విద్యను ఆయుధంగా ఉపయోగించిన గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మాజీ కౌన్సిలర్ పెంచాల శ్రీధర్ రమాదేవి, పూదరి చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు..

# అంబేద్కర్ విగ్రహం ముందరి భాగంలో తోపుడు బండ్ల తొలగింపునకు వినతి



**నిర్మల్ జిల్లా, ఏప్రిల్ 12 (జర్నలిస్ట్ ఫైల్) :** నిర్మల్ పట్టణంలోని ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ముందుభాగంలో అక్రమంగా ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను తక్షణమే తొలగించాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అధికారులను కోరారు. శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం సమర్పించారు. విగ్రహం పరిసర ప్రాంతంలో మిర్చి బండ్లు, కూరగాయల బండ్లు, పాన్ పరాగ్ విక్రయించే తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం వల్ల పరిసరాలు అస్వచ్ఛంగా మారుతున్నాయని, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటోల్ల వెంకటస్వామి మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహం ప్రాంగణం గౌరవప్రదంగా, పరిశుభ్రంగా ఉండేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. 24 గంటల్లోగా సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఈరోల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే ఘనంగా జయంతి వేడుకలు



**-అణగారిన వర్గాల, మహిళల హక్కుల కోసం పోరాటం-సత్యశోధక్ సమా జ్ స్థాపన, విద్యే జ్ఞానానికి మార్గమని విశ్వసించడు - ఉప సర్పంచ్ మొగిలి కరుణాకర్**

**- ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయం మహిళ సాధికారత ఉద్యమాలకు ఆద్యుడు పూలే - దుబ్బాక రమేష్**

**- కుల వివక్షకు వ్యతిరేకంగా, స్త్రీ విద్య కోసం సావిత్రిబాయి పూలే తో కలిసి కృషి చేశారు - ఏఎంసి డైరెక్టర్ ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

**తంగనపల్లి, ఏప్రిల్12 (జర్నలిస్ట్ ఫైల్) :** రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగనపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడమైనది ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మొగిలి కరుణాకర్ మాట్లాడుతూ గొప్ప సామాజిక సంస్కర్త, కుల వ్యతిరేక ఉద్యమకారుడు, మహిళా విద్య కోసం పోరాడిన జ్యోతిబా పూలే జీవిత విశేషాలు బిఆర్ఎస్ నాయకుడు దుబ్బాక రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్యోతిబాపూలే సమాజంలో సమానత్వం,సామాజిక న్యాయం,విద్యా విస్తరణ కోసం చేసిన సేవలు అమూల్యమని తెలిపారు.ముఖ్యంగా మహిళల విద్యకు ఆయన చేసిన కృషి భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని,ప్రతి విద్యార్థి జ్యోతిబాపూలే ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గ్రామం ఉప సర్పంచ్ మొగలి కరుణాకర్,బిఆర్ఎస్ నాయకులు దుబ్బాక రమేష్, కాంగ్రెస్ నాయకులు ఏఎంసి డైరెక్టర్ ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్, వార్డ్ నెంబర్లు తాళ్ల పెల్లి మమత, బండి శీను, ఉడుతల కిషన్, మాచిరెడ్డి రవి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలి భానుచందర్ గౌడ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పూలే,సావిత్రిబాయికి భారతరత్న ఇవ్వాలి: గొడిసెల శ్రీహరి



**బెల్లంపల్లి, ఏప్రిల్12 (జర్నలిస్ట్ ఫైల్) :** మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా జజ్జరెల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పూలే-పెరియార్-అంబేద్కర్ ఆలోచన వేదిక అధ్యక్షుడు గొడిసెల శ్రీహరి మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలేతో కలిసి పూలే దంపతులు భారతదేశంలో బాలికల విద్యకు పునాది వేసి సమాజంలో గొప్ప మార్పుకు నాంది పలికారని అన్నారు.విద్య ద్వారా సమాజంలో చైతన్యం, సమానత్వం సాధ్యమని పూలే చూపించిన మార్గం నేటికీ ప్రాసంగికమని పేర్కొన్నారు. అగ్రవర్ణ ఆధిపత్యాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ అనేక అవమానాలను తట్టుకుని బాలికలకు విద్య అందించారని తెలిపారు.1873లో సత్యశోధక సమాజాన్ని స్థాపించి శూద్రులు, అతి శూద్రుల హక్కుల కోసం పోరాడిన పూలే సమాజంలో కుల, మత అసమానతలను తొలగించేందుకు కృషి చేశారని వివరించారు. గులాంగిరి వంటి రచనల ద్వారా ప్రజలకు నిజమైన చరిత్రను తెలియజేశారని చెప్పారు.ఈ సందర్భంగా పూలే, సావిత్రిబాయి పూలే సేవలను గుర్తించి వారికి భారతరత్న పురస్కారం ఇవ్వాలని గొడిసెల శ్రీహరి డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాడుగురి శాంత చినబాబు, ఉప సర్పంచ్ కొట్రంగి రాజకుమార్, కొట్రంగి రమేష్, రంగ ప్రశాంత్, అక్కు కృష్ణ, గొడిసెల సామి, మాటూరి కృష్ణ, నల్లవెల్లి అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

## రాథోడ్ శేషారావు కి నివాళులర్పించిన మాజీ మంత్రి జోగు రామన్న



**నార్నూర్, (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ సోదరులు రాథోడ్ శేషారావు గత గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ ఈ రోజు ఉదయం తుది శ్వాస విడడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అదిలాబాద్ బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న భీంపూర్ గ్రామానికి చేరుకొని నివాళులు అర్పించి అంతిమ యాత్రలో పాల్గొనే పడే మోశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ శేషారావు వృత్తి పరంగా ఉద్యోగం చేస్తూ మంచి సేవలందించారు అని కొనియాడారు

# 14న దేశంలోనే మొట్టమొదటి క్వాంటం రిఫరెన్స్ సెంటర్ కు అంకురార్పణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలోనే మొట్టమొదటి క్వాంటం రిఫరెన్స్ సెంటర్ కు ఈ నెల 14వ తేదీన అంకురార్పణ జరుగుతుంది. ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ వేదికగా ఈ కార్యక్రమాన్ని అమరావతి క్వాంటం వ్యాలీ సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ విక్రమ్ సారాభాయ్ బ్లాక్ లో క్వాంటమ్ హార్డ్ వేర్ టెస్ట్ బెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. ఈ కేంద్రం క్వాంటం రీసెర్చ్ బలోపేతానికి దోహదం చేయనుంది. మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది.
రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆదివారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తనిఖీ చేశారు. విక్రమ్ సారాభాయ్ బ్లాక్ లో క్వాంటం రిఫరెన్స్ సెంటర్ ప్రారంభోత్సవం అనంతరం ఎస్.ఆర్.ఎం ఆడిటోరియంలో జరిగే సభా కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈ రెండు వేదికలను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా విశ్వవిద్యాలయ అధికారులతో జిల్లా అధికారులు సమన్వయం చేయాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వినాయక్, తెనాలి ఇన్ ఛార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, డీటీసీ సీతారామిరెడ్డి, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ జ్యోతి బసు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, మంగళగిరి తహసీల్దార్ దినేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ జాఫర్ సాధిక్ బాషా వెల్ ఫేర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



- శ్రీ టౌన్ సి ఐ, ఎస్. సాంబశివరావు
- 4లక్షల మేర ఉపకార వేతనాలు పంపిణీ

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** భగవంతుడు ఇచ్చిన సంపదను ఇబ్బందులలో ఉన్న సంఘీయ, పేద ముస్లీం కుటుంబాలకు పంచే మంచి మనసున్న ఖలీల్ అభినందనీయులని,ఆయన సేవలను సమర్థించే సంతానం ఉండటం నేటి సమాజంలో గొప్ప విషయమని, త్రీ టౌన్ సి ఐ, ఎస్. సాంబశివరావు పేర్కొన్నారు. అందరు బాగుండాలి అందులో మనం ఉండాలన్న మంచి సంకల్పంతో, డాక్టర్ జాఫర్ సాధిక్ బాష ముస్లీమ్ మైనార్టీ వెల్ ఫేర్ ట్రస్ట్ చైర్మన్ షేక్ ఖలీల్ ఆధ్వర్యంలో, ఆదివారం, కొత్తపేటలోని కాకతీయ బ్యాంక్ కాంప్లెక్స్, కాన్ఫరెన్స్ హాల్లో, విద్యార్థినీ, విద్యార్థులకు, విద్యా అవసరాలకోసం, ఉపకార వేతనాలు, వైద్య సేవల కోసం, సంఘీయ వృధ్ధులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి, ఖలీల్ అధ్యక్షత వహించగా, త్రీ టౌన్ సి ఐ, ఎస్. సాంబశివరావు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతు జాఫర్ సాధిక్ బాష ట్రస్ట్ సామాజిక సేవలను ప్రశంశించారు. సంపాదనలో కొంత సాయం చేయాలన్న ఆలోచనకు, కుటుంబం అండగా ఉండటం గొప్ప విషయమన్నారు. విధినిర్వాహణలో, నిరంతరం ఖటువుగా ఉంటూ, అనేక ఆటుపోట్లకు దగ్గరగా ఉండే తమకు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కొంత ఒత్తిడి అధిగ మించేఅవకాశం లభిస్తుందని అన్నారు.
అనంతరం విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందజేశారు, సంస్థ చైర్మన్ షేక్ ఖలీల్ మాట్లాడుతు తమ సంస్థ ద్వారా చేపడుతున్న సేవలను వివరించారు. 51మందికి 4లక్షలు ఉపకార వేతనంగా అందజేశా మన్నారు. కార్రక్రమంలో కాకతీయ బ్యాంక్ గౌరవ చైర్మన్ దావులూరి సోమశేఖరరావు, సిపిఎమ్ నాయకులు కెబి. ప్రసాద్, షేక్ హుసేన్ వలి తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక సిబ్బంది అవినీతిపై విచారణ చేయాలి



- ఎంఐఎం మస్తాన్ వలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న జిల్లా అగ్నిమాపక సిబ్బంది అవినీతిపై విచారణ చేపట్టాలని ఎంఐఎంపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంహెచ్పిఎస్. రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ వలి అన్నారు. ఫైర్ సేఫ్టీ తనిఖీల్లో లంచాలకు అలవాటుపడిన అధికారులపై రీజనల్ ఫైర్ అధికారి (ఆర్ఎఫ్ఓ) విచారణ జరపాలని, అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ వలి మాట్లాడుతూ కళ్యాణమండపాలు, ఫంక్షన్ హాళ్లు, లాడ్జీలు, కమర్షియల్ కాంప్లెక్సులో ఫైర్ సేఫ్టీ పనులు ఉన్నాయో లేదో, ఫైర్ ఎన్ఓసీలు ఉన్నాయో లేవో తనిఖీ చేసి, భద్రత లేని సంస్థలకు నోటీసులు జారీ చేయాల్సిన బాధ్యత జిల్లా అగ్నిమాపక సిబ్బందిపై ఉందని అన్నారు. కానీ వాస్తవంలో వారు లంచాలకు అలవాటుపడి ప్రజల భద్రతను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏదయినా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? ఫైర్ సేఫ్టీ లేకుండా అగ్ని ప్రమాదం జరిగితే జిల్లా ఫైర్ అధికారి (డీఎఫ్ఓ) బాధ్యత వహిస్తారా? అని మస్తాన్ వలి ప్రశ్నించారు. తనిఖీలు చేయాల్సిన డీఎఫ్ఓ తమ బాధ్యతను ఎంతవరకు నెరవేరుస్తున్నారో ఆర్ఎఫ్ఓ విచారణ జరిపి ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రజల భద్రత కోసం సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు తెలిపిన సర్వర్ ఖాన్ పేట గ్రామస్తులు

**ఖాజీపేట (జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా ఖాజీపేట మండలం పుల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని సర్వర్ఖాన్ పేట గ్రామంలో గత మూడు రోజులుగా త్రాగునీరు సరఫరా చేసే మోటార్ చెడిపోవడం కారణంగా గ్రామస్తుల ఇబ్బందులను ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి (గతంలో కడప ఆర్డీఓ) మధుసూదన్ దృష్టికి కాజీపేట ఆదర్శ పాఠశాల మాజీ చైర్మన్ పూల రియాజ్ అహ్మద్ తీసుకెళ్లగా పిఏ వెంటనే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి కడప జిల్లా పరిషత్ సీఈవో వెంటనే నూతన మోటారు కొనుగోలు చేసి ఆ గ్రామానికి నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు తక్షణమే మోటార్ బిగించి గ్రామస్తుల అభ్యర్థులను స్వీకరించి స్పందించినందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు

# ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

- గుంటూరు ముస్లిం సమాజం కోసం జనజా వాహనం అందజేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు సేవ చేయడం ఒక బాధ్యతగా భావించి, ఆదర్శ కమిటీగా నిలవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. ఆదివారం గుంటూరు పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రమాణ పత్రంపై సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ముస్లిం సోదరుల అంత్యక్రియల సమయంలో ఇబ్బంది పడకుండా ఉండటానికి రూ.14 లక్షలతో నూతన జనజా వాహనం "శ్రీ భ్రమర టౌన్ షిప్స్" సౌజన్యంతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి షాదీఖానా కమిటీకి అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ సోదరులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తారని, అదే క్రమశిక్షణను ఈ కమిటీ పనితీరులో కూడా చూపించాలని కోరారు. గుంటూరు పశ్చిమలో మైనారిటీల కోసం శుభకార్యాలకు అనువైన స్థలంగా ఈ షాదీఖానా ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి భవనం అందించారని గుర్తుచేశారు. ఈ షాదీఖానా కేవలం ఒక నియోజకవర్గానికే కాకుండా జిల్లా స్థాయిలో ప్రాచుర్యం పొందిందని, గతంలో కొంతమంది నిర్వాహకుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా ఇది సామాన్యులకు అందుబాటులో లేకుండా వ్యాపార ధోరణిలోకి మారిందని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రెండు సంవత్సరాల కాలపరిమితి ముగిసే వరకు కొత్త కమిటీ ఏర్పాటు చేయకుండా నియమ నిబంధనలకు కట్టుబడి వ్యవహరించామని, అధికార దుర్వినియోగానికి తావులేకుండా వ్యవహరించడం కూటమి ప్రభుత్వ ధర్మమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. రంజాన్ మాసం అనంతరం పెద్దల సూచనలతో ఈరోజు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అనుభవజ్ఞులు, యువత, పెద్దల ఆమోదంతో ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీకి రెండు సంవత్సరాల కాలవ్యవధి ఉండగా, ఈ కాలంలో షాదీఖానాకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు మరింత ప్రతిష్ట తీసుకురావాలని సూచించారు. మౌలానాల కార్యకలాపాల కోసం నిలిచిపోయిన భవనం నిర్మాణాన్ని పూర్తి చేయడానికి నిధులు సమకూర్చి, అదే కమిటీ కాలంలో పూర్తి చేయాలని అధికారులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు షేక్ నజీర్, నూర్ భాషా ఆసియా, మెహబూబ్ సుభాని, ఖాసీం, సుభాని, రషీద్‌లకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు మరియు ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధి తోపాటు సేవా పెరగాలి : ఎమ్మెల్యే నసీర్

- ఆలయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యత తీసుకోవాలి
- రూ.3.66 కోట్లతో లాలాపేట వెంకటస్వామి ఆలయ పునర్నిర్మాణం
- మూడు దేవాలయాల ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** దేవాలయాల అభివృద్ధికి, పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. నగరంలోని లాలాపేటలో శ్రీ జగన్నాథ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నసీర్ హాజరై నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆలయాల ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో ఉత్సవ కమిటీలకు వచ్చిన ఆదాయం ఆ ఉత్సవాలకే సరిపోయేదని అన్నారు. ఉత్సవాలకు వచ్చిన ఆదాయం ఆలయాలకు ఉపయోగపడాలనే సంకల్పంతో ఇప్పటికే కొన్ని ఆలయాల్లో జనరేటర్లు, సోలార్ పవర్ సిస్టమ్స్ ఏర్పాటు చేయించామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నా హయాంలో కనీసం 10 ఆలయాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆలయ కమిటీ సభ్యులు ప్రతి నెలా లక్ష్యాలు పెట్టుకొని ఆలయాల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్నదానం వంటి కార్యక్రమాలకు ఎలా శ్రీకారం చుట్టారో అదే స్ఫూర్తితో ఇక్కడ ఆలయాలలోనూ అలాంటి సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నూతన కమిటీ సభ్యులకు చెప్పారు. లాలాపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి అలయ పునర్నిర్మాణాన్ని రూ 3.66 కోట్లతో చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఐదు ఆలయాలలో సీజేఎస్ ఫండ్స్ ద్వారా సౌకర్యాలు కల్పించామని, దాతలు, ప్రభుత్వ సహకారంతో ఆలయాల అభివృద్ధికి ముందడుగు వేశామని చెప్పారు. లాలాపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి పద్మావతి హాస్పిటల్ వైద్యులు సుబ్బారావు చేయూతనందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత పాలకులు లీజుల పేరిట వారి కుటుంబ సభ్యులకు అలయాల ఆదాయాన్ని దోచిపెట్టారని విమర్శించారు. పవిత్రమైన టీటీడీ ఆలయ లడ్డూల తయారీలోనూ కల్తీ చేసిన నీచ చరిత్ర వైసీపీదని మండిపడ్డారు.

**ఇదే నూతన కమిటీ..**

మూడు ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మన్ గా మల్లెంపూడి శ్రీనివాస్, డైరెక్టర్లుగా గడస అరుణ, బొలిశెట్టి జగదీష్, సంది రెడ్డి గిరిబాబు, యయవరం లలిత, తుళ్లూరు కిరణ్ కుమార్, బి దుర్గ, బిట్రగుంట అరుణకుమారి, గ్రంధిసిరి శివయ్య, ఎర్రంశెట్టి గిరి, దాసరి పద్మావతి నియమితులయ్యారు.

# కస్తూర్బా జూనియర్ కాలేజీని ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్ట

- రూ 1.35 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా జూనియర్ కాలేజీ



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు అభివృద్ధి విద్యా ప్రగతి పట్ల అంకితభావంతో నిరంతరం కృషి చేస్తున్న ప్రజా నాయకుడు పుట్టా సుధాకర్ యాదవ్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన కస్తూర్బా జూనియర్ కాలేజ్ భవనాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. 1.35 కోట్ల వ్యయంతో నిర్మించబడిన ఈ నూతన భవనం ఆధునిక సౌకర్యాలతో విద్యార్థులకు అనుకూలంగా రూపుదిద్దుతుంది విశాలమైన తరగతి గదులు సరైన మౌలిక వసతులు విద్యార్థుల అభ్యాసానికి అనువైన వాతావరణంతో ఈ కాలేజీ భవనం మైదుకూరు ప్రాంత విద్యారంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా నగర స్థాయి విద్యను అందుకునేలా ఈ నిర్మాణం దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని నాణ్యత సమయానికి పూర్తిచేసిన కాంట్రాక్టర్ ఆకుల కృష్ణయ్యని హృదయ పూర్వకంగా అభినందించారు అలాగే జిల్లా విద్య అధికారి సంశుద్దిన్ కృషిని ప్రత్యేకంగా ప్రశంసిస్తూ జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఆయన తీసుకుంటున్న చర్యలు ఆదర్శప్రాయమని కొనియాడారు విద్యారంగం బలోపేతం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి అత్యంత ప్రేరణత్మకంగా ప్రసంగించారు విద్య మన జీవితానికి బలమైన పునాది లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఎలాంటి పరిస్థితులైన జయించవచ్చు క్రమశిక్షణ పట్టుదల కృషి ఈ మూడు మీ విజయానికి మూల స్తంభాలు అని ఆయన అన్నారు యువత తమ సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సమాజానికి ఉపయోగపడే బాధ్యత గల పౌరులుగా ఎదగాలని సూచించారు విద్యారంగా అభివృద్ధికి తాను ఎప్పుడు కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే మరోసారి స్పష్టం చేశారు భవిష్యత్తులో మరిన్ని విద్యాసంస్థలు మౌలిక వసతులు తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను అందుకోవడం తన లక్ష్యమని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సంశుద్ధిన్ స్థానిక ప్రజాప్రతినిధులు టిడిపి నాయకులు పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి పూలమాలలు శాలువాతో సత్కరించారు.

# నారాయణ అష్టాక్షరీ క్షేత్రంలో వైభవంగా తిరుప్పావడ సేవ



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** కలియుగాంతం వరకు భక్తుల కరుణించి కాపాడే స్వామి కలియుగ వరదైవమైన శ్రీవెంకటేశ్వర స్వామి అని, ఆ స్వామికి నిర్వహించే తిరుప్పావడ సేవకు ఎంతో పరమార్థం ఉందని, స్వామి ముంగిట రాశిగా పోసే, పులహోరకు జరిగే శాంతి, అన్నశాంతియని, అలా అన్నశాంతి జరిగిన పులిహోరను భక్తులు ప్రసాదంగా స్వీకరించడం ద్వారా శాంతి, సౌఖ్యం, సౌభాగ్యం సమకురుతాయని, భక్తుల ప్రగాఢ నమ్మకమని తిరుప్పావడ సేవ ప్రాధాన్యతను వేద పండితులు భక్తులకు వివరించారు. స్థానిక బాలాజీరావుపేట ప్రియాడీలక్స్ ఎదుటగల, కోట బదరీనాద్ గుప్త, స్థల ప్రాంగణంలో, నారాయణ అష్టాక్షరీ క్షేతమందు, శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ సంకల్పంతొ, శ్రీ విఖనస శ్రీనవాస ట్రస్ట్ నిర్వాహణలో ఆదివారం శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రీతిగా, 121కేజీల, పులిహోర రాశిగా తిరుప్పావడ సేవను,వైఖానస ఆగమోక్తంగా ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రొంపిచెర్ల వెంకట కిరణ్ మాట్లాడుతు ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తున్న, శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ద్వారా శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పనులు త్వరితగతిన ముందుకు సాగాలన్న లక్ష్యంతొ, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం సహకారంతొ, ఏడుకొండల స్వామికి, ఏడు శనివారములుశ్రీ వెంకటేశ్వర గానామృత సేవ మొదలు పెట్టి, 42శనివారములు పూర్తి చేసుకున్నందున, తిరుప్పావడ సేవకు ప్రాధాన్యత కల్పించామన్నారు, మే నెల 30వ తేదీతొ ఏడు శనివారముల, గానామృత సేవకు 49 శనివారములు పూర్తి చేసిన అనంతరం, తిరుపతి ఏడుకొండల స్వామికి, సుప్రభాత సేవనుండి పవళింపు సేవ వరకు ఉండే అన్ని సేవలను భక్తుల సమక్షంలో చేయాలన్నదే సంకల్పమని తెలిపారు. వేద పండితులు నారాయణం గోవర్ధన లక్ష్మీ రఘురామ్, వేదాంతం నాగమారుతి, రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, వైఖానస ఆగమరీతిన పూజావిధులు నిర్వహించారు. అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు. శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ బాధ్యులు, గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, ఆర్. సురేష్, కోట వెంకట రామ్మోహనగుప్త, కోట బదరీనాద్ గుప్త, గోలి సోమశేఖర్, మడుపల్లి చంద్రశేఖర్,జంజం రామారావు, మాజేటి వెంకటేష్, మద్దెల చలంబాబు, కర్పూరపు ఉదయ్ భాస్కర్,అంబటి శ్రీనివాస్ రావు, కోట రవిశంకర్, బచ్చు లీలా ప్రసాదరావు, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ తదితర మహిళా భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎండ తీవ్రతకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- నక్కల దిన్నె పీహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అల్లాడుపల్లె లక్ష్మీపేట సచివాలయంలలోని పసుపు పంట పొలాలలో ఉన్న రైతులు రైతు కూలీలకు ఎండ తీవ్రతను గురించి అవగాహన కల్పించామని నక్కల దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు తెలియజేశారు.
ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు పసుపు పంట పొలాలలో ఉన్న కూలీలను ఉద్దేశించే మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు, ముఖ్యంగా పొలాలలో పని చేసే కూలీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందు జాగ్రత్తగా మీకు దాహం వేయకపోయినా తగినంత నీరు తాగాలని,ప్రయాణించేటప్పుడు , బయటికి పోయేటప్పుడు నీళ్ల బాటిల్ తీసుకుని వెళ్ళాలని, ఓ ఆర్ ఎస్ ద్రావణం తాగాలని మరియు నిమ్మ రసం, మజ్జిగ, పండ్ల రసాలు, తీసుకోవాలని, బయటికి వెళ్లేటప్పుడు వదులుగా ఉన్న కారు దుస్తులు ధరించడం, అలాగే గొడుగు లేదా టవల్ తీసుకుని వెళ్ళాలని ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, ముసలి వాళ్ళు, బయట పని చేసే వారు, వడదెబ్బకు గురి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డాక్టర్ ఓబులేసు తెలియజేశారు.
అనంతరం ఆరోగ్య విస్తరణ అధికారి యం రాఘవయ్య మాట్లాడుతూ వడదెబ్బ తగిలిన వ్యక్తిలో వికారం లేదా వాంతులు, తలనొప్పి, విపరీతంగా దాహం వేయడం, వేగవంతంగా శ్వాస మరియు గుండె కొట్టుకోవడం తదితర శరీర ఉష్ణోగ్రత 40డిగ్రీ ఉంటుందని, ఈ లక్షణాలు ఉన్నవారిని వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకొని వెళ్లాలన్నారు. ఆ వ్యక్తిని వీలు ఉన్నంతవరకు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని పోయి చికిత్సలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ప్రసాద్, యం ఎల్ హెచ్ పి లు రాజ రాజేశ్వరి, సుమలత, ఎ ఎన్ యం లు అంజనమ్మ, కీర్తి, ఆశా కార్యకర్తలు నరసమ్మ, పద్మావతి ప్రజలు పాల్గొన్నారు..

# దాహార్తులకోసం అన్నదాత సుఖీభవ సంస్థ చలివేంద్రం సేవలు ముదావహం



- డిఎస్పీ. బి. జానార్ధనరావు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పెరుగుతున్న ఎండతీవ్రత కనుగుణంగా దాతల తోడ్పాటుతొ చలివేంద్రం సేవలను ఏర్పాటు చేయడం ముదావహమని తెనాలి డిఎస్పీ బి. జనార్ధనరావు, అన్నదాత సుఖీభవ సంస్థ వారి చలివేంద్రం ప్రారంభ సందర్భంగా అన్నారు. బోస్ రోడ్ లోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్లో, అన్నదాత సుఖీభవ సంస్థ వారి 4వ,వేసవి చలివేంద్రం సేవలను ఆదివారం తెనాలి డిఎస్పి బి. జనార్ధన్ రావు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి, వేసవిలో రెండు నెలలపాటు అన్నదాత సుఖీభవ వారి ఆధ్వర్యంలో దాహార్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని దీనికి సహకరిస్తున్న దాతలు ఎంతో సహృదయులని కొనియాడారు . అన్నదాత సుఖీభవ వారి ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా పేద వర్గాలకు విభిన్న సేవలను చేరువ చేస్తున్నామని, గత మూడు సంవత్సరాలుగా వేసవికాలంలో మజ్జిగ మంచినీరు పంపిణీ చేస్తున్నామని దీనికి దాతలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని, అన్నదాత సుఖీభవ సంస్థ సభ్యులు జీవి నారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలొవన్ టౌన్ సి ఐ,మల్లికార్జునరావు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం కార్యదర్శి గుమ్మడి వెంకట నారాయణ, గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళీ, అంగళకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం,అడ్డాల ఆంజనేయులు , మొవ్వ సత్యనారాయణ , రాచాబత్తుని శ్రీనివాసరావు , ముద్దాభక్తుని రమణయ్య, ఓలేటి వెంకట ప్రతాప్ కొత్త గొర్ల శ్రీనివాసరావు , చాగంటి చంద్రశేఖర్ రెడ్డి , అబ్దుల్ రజాక్, కాజా లక్ష్మీనారాయణ, సిక్కినం వరప్రతాప్, కుర్రా శ్రీనివాస రావు,ఎమ్.రమాదేవి , ఎమ్.విద్యుల్లత , బాలు నాయక్ , ఆంజనేయ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వీరబ్రంహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకున్న రెడ్యశీ దంపతులు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** మండల కేంద్రమైన బి. మఠంలో వెలిసిన, బవిష్యత్తును ముందే చెప్పిన మహాజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యశీ వెంకటసుబ్బారెడ్డి ఆయన సతీమణి రెడ్యశీ లక్ష్మీ ప్రసన్నలు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చనతో పాటు తీర్థ ప్రసాదాలు అందించి...రెడ్యశీ దంపతులను ఆశీర్వదించారు. తదనంతరం రెడ్యశీ దంపతులను ఘనంగా సన్మానించారు. అర్చకులు స్వాముల వారిని గూర్చి, స్వాములవారు జీవ సమాధి అయిన విషయాలను గురించి రెడ్యశీ దంపతులకు వివరించారు. రైతాంగం తో పాటు, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు రెడ్యశీ దంపతులు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం




**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. గౌరవ అతిథులుగా ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ తోయజాక్షరావు, అసిస్టెంట్ డైరెక్టర్ పవన్ కుమార్ పాల్గొని జాతీయ సర్వే దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రక్తదాన శిబిరంలో 36 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి, థలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు తమ వంతు సహాయం అందించారు. ఈ సందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో సర్వే శాఖ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రక్తదానం వంటి సేవా కార్యక్రమాల ద్వారా సర్వే ఉద్యోగులు తమ సామాజిక బాధ్యతను చాటుతున్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సర్వే ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి. లక్ష్మీనారాయణ, డివిజనల్ అధ్యక్షులు కట్ట వరప్రసాద్, ఎం. శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవో సిటీ ఉపాధ్యక్షుడు భావన్నారాయణ తదితరులు, సర్వే అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పూలే ద్విశత జయంతి వేడుకలు ఏడాది పొడవునా నిర్వహించాలి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి సందర్భంగా ఈ ఏడాది మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పూలే విద్య, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలకు చేసిన సేవలను విద్యార్థులకు పరిచయం చేయడం అత్యంత అవసరమని వారు పేర్కొన్నారు. రాజకీయ స్వాతంత్ర్యం కంటే సామాజిక స్వాతంత్ర్యమే ముఖ్యమని విశ్వసించిన పూలే, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల హక్కుల కోసం విశేషంగా పోరాడారని తెలిపారు. ముఖ్యంగా స్త్రీ విద్యపై ఆయన చేసిన కృషి భారత సమాజంలో విప్లవాత్మక మార్పులకు దారితీసిందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఏడాది పొడవునా పూలే జీవితం, సేవలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విద్య, సమానత్వం, సామాజిక న్యాయం అంశాలపై సెమినార్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే వ్యాసరచన, ప్రసంగం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం, స్త్రీ విద్య ప్రాముఖ్యతపై ప్రత్యేక చర్చలు చేపట్టడం, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సమానత్వ భావన, న్యాయసూత్రాలపై అవగాహన పెంపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని వారు కోరారు.

## అమరావతిపై జగన్ విష ప్రచారం : మంత్రి నారాయణ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న తరుణంలో జగన్ విష ప్రచారం చేస్తున్నారని, మావిగన్ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ విమర్శించారు. విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. అమరావతి రైతులు పార్లమెంటులో చట్టం చేయించాలని కోరారని, ముఖ్యమంత్రి కేంద్రాన్ని పట్టుబట్టి చట్టం చేయించారని తెలిపారు. పార్లమెంటులో చట్టంపై చర్చ జరుగుతుంటే ఎంపిలు ఏమి చేయాలో చెప్పకుండా ఇక్కడ మావిగన్ అంటూ ప్రకటన చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ సెక్రటేరియట్‌కు రూ. 615 కోట్లకు టెండర్లు ఇచ్చి రూ. 1,423 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పార్లమెంటులో రూ. 862 కోట్లకు టెండర్లు పిలిచి రూ. 1,172 కోట్లు ఖర్చు చేశారని, చదరపు అడుగుకు రూ. 16,900 ఖర్చు చేశారని పేర్కొన్నారు. జాతీయ రహదారికి కేవలం రోడ్డువేసి వదిలేస్తారని, అమరావతిలో అన్ని రకాల సదుపాయాలూ కల్పిస్తున్నామనే విషయాన్ని జగన్ పార్టీ పట్టించుకోవడం లేదని అన్నారు. దోమలు లేని నగరం కావాలంటే 100 శాతం యుజిడి ఉండాలని పేర్కొన్నారు. లైట్లు, గ్రీనరీ 2014కు ముందే పూర్తయితే ఖర్చు తగ్గేదన్నారు. తారు, ఇనుము ధరలు పెరిగాయని పేర్కొన్నారు. ధరలు పెరిగితే అంచనాలు పెరుగుతాయని, దీనికి గత ప్రభుత్వం పనులు చేయకపోవడమే కారణమని అన్నారు. పనులన్నీ టెండర్ల ద్వారానే ఇచ్చామని, నామినేషన్ పద్ధతుల్లో ఇవ్వలేదని తెలిపారు. ఐదు వేల ఎకరాలు ల్యాండ్ బ్యాంకు పక్కనబెట్టామని వివరించారు. వాటిని అమ్మి అప్పులు చెల్లిస్తామని పేర్కొన్నారు. మావిగన్ ప్రతిపాదనను ప్రజలు ఛీకొడుతున్నారని వివరించారు. జగన్ ప్రకటనల వల్ల పెట్టుబడులు రాకుండా పోతాయని విమర్శించారు. అమరావతికి ఇప్పటికే రూ. పదివేల కోట్లు ఖర్చయిందని, రూ. 51 వేల కోట్ల టెండర్లు పిలిచామని అన్నారు. అమరావతి నిర్మాణం జరిగితే ఎకరా రూ. 20 కోట్లు అవుతుందని తెలిపారు. రాజధానిని 217 చదరపు కిలోమీటర్లకు ప్లాన్ చేశామని, అప్పుడు ప్రాజెక్టులు వారీ భూములు తీసుకుంటున్నామని అన్నారు. పెదపరిమిలో వెయ్యి ఎకరాలు ఒకేరోజు సమీకరణకు ఇచ్చారని పేర్కొన్నారు. పార్లమెంటులో సిఆర్‌డిఎ రీజియన్‌ను స్పష్టంగా ప్లాను చేశామని అన్నారు.

## ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ మాధవ్ ఆగ్రహం



**విజయవాడ:** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ స్పందించారు. సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా చేసిన ఈ వ్యాఖ్యలను ఎవరూ అంగీకరించరని పేర్కొన్నారు. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని నాశనం చేయాలనే భావనతో మాట్లాడటం అత్యంత అభ్యంతరకరమని ఆయన అన్నారు. రాజకీయాల్లో ఇలాంటి వ్యాఖ్యలకు స్థానం ఉండకూడదని, ఖర్గే వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే చట్టపరమైన చర్యలు తీసుకుని ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 'సబ్కా సాత్, సబ్కా వికాస్' సిద్ధాంతంతో బీజేపీ అందర్నీ కలుపుకుపోతున్న సమయంలో హిందూ-ముస్లిం మధ్య విభేదాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని మాధవ్ పేర్కొన్నారు. దేశ సమైక్యత, జాతీయవాద భావాలను ప్రోత్సహించే ఆర్ఎస్ఎస్‌పై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పోలీసు, సైన్యంతో కలిసి సేవలందించిన అనేక సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి సంస్థలను లక్ష్యంగా చేసుకుని ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం అనైతికమని, ఖర్గే చేసిన వ్యాఖ్యలు అత్యంత దిగజారుడు స్థాయిలో ఉన్నాయని అన్నారు.

## ట్రాన్స్‌ఎనర్జీ సంస్థలో ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ విద్యార్థుల ఎంపిక



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రాన్స్‌ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతమైంది. ఈ డ్రైవ్‌లో మొత్తం 43 మంది విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. ఎంపికైన వారిలో బి.టెక్ (ఈసీఈ) విభాగం నుండి 37 మంది, డిప్లొమా (ఈసీఈ) విభాగం నుండి 6 మంది విద్యార్థులు ఉన్నారు. సంస్థ హెచ్ఆర్ ప్రతినిధులు పి. జీవా, చంద్రు విద్యార్థుల ప్రతిభను పరిశీలించి ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డోలా సంజయ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, డిప్లొమా ప్రిన్సిపాల్ రవి కుమార్, డిప్లొమా వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, డిప్యూటీ టీపీఓ పి. జీవనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డోలా సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగావకాశాలు సులభంగా లభిస్తాయని తెలిపారు. ఈ విజయం విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం ఫలితమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ గత ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లలో సుమారు 57 మంది ఎంపిక కాగా, ఈసారి మరో 37 మంది ఎంపిక కావడం ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయనే సంకేతమని చెప్పారు. మెగా ప్లేస్‌మెంట్లు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించడంలో ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూషన్స్ ముందంజలో ఉన్నాయని చెప్పారు. డిప్లొమా ప్రిన్సిపాల్ రవి కుమార్ మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థులు కూడా ప్రతిభను చాటుకోవడం గర్వకారణమని, టెక్నికల్ నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ టీపీఓ పి. జీవనా మాట్లాడుతూ ప్లేస్‌మెంట్ ట్రైనింగ్, గైడెన్స్ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని, భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థలను క్యాంపస్‌కు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

## భారతీయ జనతా యువమోర్చా గుంటూరు జిల్లా నూతన కమిటీ ఏర్పాటు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) గుంటూరు జిల్లా నూతన కమిటీని బీజేపీ జిల్లా కార్యాలయం వాజ్‌పేయి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకటించారు. ఈ కమిటీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తుంగా యశ్వంత్ ప్రకటించారు.

ఈ సందర్భంగా చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి యువజన విభాగం కీలకమని పేర్కొన్నారు. గ్రామస్థాయికి పార్టీని విస్తరించి సంస్థాగతంగా బలోపేతం చేయాలని యువతకు సూచించారు.

బీజేపీ పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ మాట్లాడుతూ బీజేవైఎం పార్టీకి వెన్నుముకలాంటిదని అన్నారు. యువమోర్చాలో పనిచేసిన వారే భవిష్యత్తులో పెద్ద బాధ్యతలు చేపడుతున్నారని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయితీ ప్రదీప్, రాష్ట్ర కార్యదర్శి చల్లా కౌశిక్, రాష్ట్ర సోషల్ మీడియా కో కన్వీనర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు పాలపాటి రవికుమార్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరక కుమార్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ అబ్రహం పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా కొచ్చర్ల దుర్గ, చిలక బాలకోటయ్య గౌడ్, చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు, మేడూరు యశ్వంత్, చేవూరి ఆనంద్, సుంకర్ భానుచందర్, ప్రధాన కార్యదర్శిగా భాను ప్రకాష్ శర్మ, కార్యదర్శులుగా బయ్యపు రాజా, గణ, ఆరుద్ర గోపి, ఆకాష్, మణిదీప్, సాయి రాధాకృష్ణ, కోశాధికారిగా బత్తుల నాగ స్వప్న నియమితులయ్యారు.

## కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల 5వ మహాసభకు పిలుపు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ & ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 5వ మహాసభను ఈ నెల 12న ఉదయం 10 గంటలకు విజయవాడలోని బాలోత్సవ భవన్, రాఘవయ్య పార్క్ వద్ద నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయి బాధ్యులు ప్రతినిధులుగా తప్పనిసరిగా హాజరై మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఈ మహాసభ కీలక వేదికగా నిలవనుందని పేర్కొన్నారు. మహాసభలో ప్రధానంగా ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై చర్చించనున్నట్లు తెలిపారు. అందరినీ రెగ్యులర్ చేయడం, కనీస వేతన విధానం (ఎంటీఎస్) అమలు చేయడం, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ వ్యవస్థలోకి మార్చడం, రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం వంటి అంశాలను ప్రధానంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, మహాసభ విజయవంతం కావడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుందని ఏవీ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# నక్సల్ రహిత భారతదేశం సాకారమైంది!

## దేశాన్ని కదిలించిన హోం మంత్రి అమిత్ షా చారిత్రక ప్రసంగం



**జర్నలిస్ట్ ఫైల్:** దేశాన్ని అర్ధశతాబ్దానికి పైగా పీడించిన వామపక్ష తీవ్రవాదం చివరకు అంతమైందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్చి 30, 2026 లోక్‌సభలో చారిత్రక ప్రకటన చేశారు. "నక్సల్ రహిత భారతదేశం నేడు వాస్తవమైంది" అని ఆయన ధైర్యంగా ప్రకటించారు. 1970 నుండి 2026 వరకు సాగిన ఈ రక్తసిక్త అధ్యాయంపై జరిగిన చర్చలో అమిత్ షా చేసిన ప్రసంగం సభ మొత్తాన్ని కదిలించింది.

**20 కోట్ల గిరిజనుల తరపున...:** "12 రాష్ట్రాలకు విస్తరించి, దేశ భూభాగంలో 17 శాతాన్ని, 20 కోట్ల జనాభాను కలిగి ఉన్న 'రెడ్ కారిడార్'లో నివసించే గిరిజన సోదరసోదరీమణులు తమ బాధలు, వేదనలు పార్లమెంట్ వేదికగా ప్రపంచానికి తెలియాలని ఏళ్ళ తరబడి ఆశించారు. ఈ రోజు ఆ అవకాశం వచ్చింది" అని అమిత్ షా ప్రసంగం ప్రారంభించారు.

**పేదరికం కాదు - సిద్ధాంతమే మూలకారణం :** నక్సలిజానికి అభివృద్ధి లేకపోవడమే మూలకారణమని చేస్తున్న వాదనలను అమిత్ షా గణాంకాలతో సహా ఖండించారు.

1960ల నాటి నాలుగు ప్రాంతాలను పోల్చి చూపించారు – నక్సల్బరీలో అక్షరాస్యత 35 శాతం, తలసరి ఆదాయం రూ. 500 ఉండగా; బస్తర్‌లో అక్షరాస్యత 23 శాతం, ఆదాయం రూ. 190 మాత్రమే ఉండేది. సహర్సా (బీహార్), బల్లియా (యూపీ)లలో కూడా ఇదే స్థాయి పేదరికం ఉండేది. అయినా సహర్సా, బల్లియాలలో నక్సలిజం ఎందుకు పుట్టుకు రాలేదు?

"ఎందుకంటే అక్కడ దట్టమైన అడవులు, కొండలు లేవు. సాయుధ కార్యకలాపాలకు అనువైన భూభాగం లేదు. కాబట్టి పేదరికం కారణం కాదు – సిద్ధాంత వ్యాప్తికి అనువైన భూభాగమే వారిని ఆకర్షించింది" అని అమిత్ షా స్పష్టం చేశారు.

"వారు పాఠశాలలు తగులబెట్టారు, బ్యాంకులు ధ్వంసం చేశారు, వైద్యశాలలు నాశనం చేశారు. తామే అభివృద్ధిని అడ్డుకుని, అభివృద్ధి రాలేదని ఆరోపించారు" అని ఆయన ఆగ్రహంగా పేర్కొన్నారు.

**101 సంవత్సరాల వామపక్ష కుట్ర:** నక్సలిజం చరిత్రను విస్తారంగా వివరించిన అమిత్ షా – 1925లో రష్యా ప్రభుత్వ నిధులతో భారత కమ్యూనిస్ట్ పార్టీ స్థాపన నుండి 2004లో PWG, MCC విలీనమై CPI (Maoist) ఏర్పడటం వరకు ఒక్కొక్క మజిలీని సభ ముందు ఆవిష్కరించారు.

"1964లో రష్యా-చైనా వివాదంతో చైనా అనుకూల CPI(M) ఏర్పడింది. 1969లో పార్లమెంటరీ రాజకీయాలను వ్యతిరేకించి సాయుధ విప్లవాన్ని లక్ష్యంగా చేసుకుని CPI(ML) స్థాపించబడింది. ఇదే నేటి మావోయిస్టుల మూలం" అని ఆయన వివరించారు.

"1970 నుండి 2004 వరకు నాలుగేళ్ళు మినహా మిగిలిన కాలమంతా కాంగ్రెస్ పాలించింది. నక్సలిజం ఏ కాలంలో వ్యాపించి బలపడిందో ఒక్కసారి చూసుకోండి" అని ఆయన ప్రశ్నించారు.

1970లో రాష్ట్రపతి ఎన్నికల సమయంలో మావోయిస్టు పార్టీలు ఇందిరా గాంధీకి మద్దతు ఇచ్చాయని, ఆమె ఆ మద్దతును అందిపుచ్చుకుని 1980 వరకు వారి భావజాల ప్రభావంలోనే ఉండిపోయారని అమిత్ షా ఆరోపించారు.

**నక్సలిజం వల్ల జరిగిన నష్టాలు - దేశం కంటతడి పెట్టింది:** ఒక ఎన్జీవో లెక్కల ప్రకారం ఇరువైపులా 20,000 మంది యువకులు మరణించారని, 5,000 కి పైగా భద్రతా సిబ్బంది అమరులయ్యారని అమిత్ షా వివరించారు. 15,000 మంది పిల్లలు నక్సలైట్ శిబిరాల్లో జీవితాలు నాశనం చేసుకున్నారు. వేలాది మంది జీవితాంతం అంగవైకల్యానికి గురయ్యారు.

నక్సలైట్లు బస్తర్‌లో సమాంతర ప్రభుత్వం నడిపారని, ప్రజా న్యాయస్థానాల పేరుతో అమాయక గ్రామస్తులను ఉరితీశారని ఆయన వివరించారు. వారి వార్షిక జనతా పన్ను వసూళ్ళు రూ. 240 కోట్లు అని వారి స్వంత కార్యదర్శి కంప్యూటర్‌లో దొరికిన సమాచారం ఆధారంగా తెలిపారు.

**కాంగ్రెస్ పాత్రపై తీవ్ర ఆరోపణలులి :** మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో స్థాపించిన జాతీయ సలహా మండలిలో నక్సలైట్ సానుభూతిపరులు సభ్యులుగా ఉండేవారని అమిత్ షా బాంబు పేల్చారు. "ఒక అగ్ర నక్సలైట్ నాయకుడి భార్యకు ఎన్జీఓ బాధ్యత అప్పగించారు. 2010లో దోషులుగా నిర్ధారించబడిన వ్యక్తులు ప్రణాళికా సంఘం కమిటీలలో కొనసాగారు" అని ఆయన ఆరోపించారు.

2010లో చింతల్‌నార్‌లో 76 మంది పోలీసు సిబ్బంది ఒకేసారి హత్యకు గురైన తర్వాత నక్సలైట్లతో "మీరు ఆయుధాలు విడిచిపెట్టరని మాకు తెలుసు" అని హోం మంత్రి చిదంబరం వ్యాఖ్యానించారని అమిత్ షా తీవ్రంగా ఖండించారు. "ఇలాంటి ధోరణితో నక్సలైట్ల మనోధైర్యం ఎలా దెబ్బతింటుంది?" అని ఆయన ప్రశ్నించారు.

రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో నక్సల్ సానుభూతిపరులతో కలిసి వేదికలు పంచుకున్నారని, 172 మంది సైనికులను హత్య చేసిన హిద్మా మరణించినప్పుడు "ప్రతి ఇంటి నుండి హిద్మా పుడతాడు" అనే నినాద వీడియోను స్వయంగా ట్వీట్ చేశారని అమిత్ షా ఆరోపించారు. "20,000 మరణాలకు బాధ్యత వహించాల్సింది కాంగ్రెస్ పార్టీయే" అని ఆయన స్పష్టంగా చెప్పారు.

**2014 తర్వాత మోదీ ప్రభుత్వం సాధించిన మార్పు :** 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం స్పష్టమైన రాజకీయ సంకల్పంతో, సమగ్ర వ్యూహంతో నక్సల్ నిర్మూలనకు పూనుకున్నదని అమిత్ షా వివరించారు. ఆగస్టు 20, 2019న రూపొందించిన వ్యూహం ప్రకారం కేంద్ర-రాష్ట్ర సమన్వయం బలోపేతమైంది.

"ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత కాలం నక్సల్ నిర్మూలన ఆలస్యమైంది. బీహార్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్ 2024కు ముందే నక్సల్ రహితంగా మారాయి. ఛత్తీస్‌గఢ్ మాత్రమే మారలేదు" అని ఆయన రికార్డులో పేర్కొన్నారు.

2024 జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పూర్తి సమన్వయం సాధ్యమైందని, ఆగస్టు 24, 2024న మార్చి 31, 2026 నాటికి నక్సల్ రహిత భారతదేశం సాధిస్తామని తాను చేసిన ప్రకటన నేడు నెరవేరిందని అమిత్ షా చెప్పారు.

**ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ - చరిత్రలో నిలిచిపోయే యుద్ధం :** తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో 50×37 కి.మీ. కొండపై నక్సలైట్లు ఐదేళ్ళకు సరిపడా మందుగుండు, ఆహారంతో శాశ్వత శిబిరం ఏర్పాటు చేసుకున్నారని అమిత్ షా వెల్లడించారు. అక్కడ సౌరశక్తి, IED తయారీ కర్మాగారాలు, 400-500 మంది సాయుధ కార్యకర్తలు ఉన్నారని తెలిపారు.

"45 డిగ్రీల మండువేసవిలో, 300 గ్రాముల నీళ్ళ రేషన్‌తో మన సైనికులు 21 రోజులు పోరాడారు. వారు ఫిర్యాదు చేయలేదు సార్" అని చెప్పిన అమిత్ షా గొంతు ఆర్ద్రమైంది. 30కి పైగా మావోయిస్టులు హతమయ్యారు, మిగిలిన వారు లొంగిపోయారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం నక్సల్ ముక్తమైంది.

**నాయకత్వ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది :** 2024 ప్రారంభంలో 21 మంది కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులు ఉండేవారు. వారిలో ఒకరు అరెస్టయ్యారు, ఏడుగురు లొంగిపోయారు, 12 మంది హతమయ్యారు, ఒకరు మాత్రమే పరారీలో ఉన్నారు. 49 సంవత్సరాలు చురుకుగా ఉన్న ప్రధాన కార్యదర్శి బసవరాజు, 172 మంది సైనికులను హత్య చేసిన హిద్మా సహా అన్ని స్థాయిల నాయకులు హతమయ్యారు లేదా లొంగిపోయారు.

2024 నుండి 2026 మార్చి వరకు 706 మంది నక్సలైట్లు ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు, 2,218 మంది అరెస్టయ్యారు, 4,839 మంది లొంగిపోయారు.

**అభివృద్ధి వెల్లువెత్తింది :** 2014 తర్వాత నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో 12,000 కి.మీ. రహదారులు, 5,000 మొబైల్ టవర్లు, 1,804 బ్యాంకు శాఖలు, 259 ఏకలవ్య పాఠశాలలు, జగదల్‌పూర్‌లో 240 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించబడ్డాయని అమిత్ షా తెలిపారు. నక్సల్ ప్రభావిత జిల్లాలు 2014లో 126 ఉండగా నేడు కేవలం రెండుకు తగ్గాయని ఆయన చెప్పారు.

**పట్టణ నక్సల్స్‌పై నిప్పులు చెరిగారు :** "6 రోజుల్లో 2,000 వ్యాసాలు చదివాను. అన్నీ నక్సలైట్లపై సానుభూతితో నిండి ఉన్నాయి. కానీ 8 ఏళ్ళ వయసులో అపహరించబడిన అమాయక బాలుడి గురించి ఒక్క వ్యాసం కూడా లేదు. పొలానికి వెళ్ళే దారిలో బాంబు పేలి కాలు కోల్పోయిన రైతు గురించి ఒక్క వ్యాసం కూడా లేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "మీరు నిజంగా మానవతావాదులైతే ఆ పునరావాస శిబిరాలకు వెళ్ళి రెండు రాత్రులు గడపండి" అని మేధావులను సవాలు చేశారు.

**కన్నీళ్ళు తెప్పించిన శిబిర దృశ్యాలు :** పునరావాస శిబిరాల్లో తాను చూసిన దృశ్యాలను అమిత్ షా సభ ముందు వివరించినప్పుడు సభ మొత్తం నిశ్శబ్దమైంది.

"ఒక నక్సలైట్ అమ్మాయికి నెయిల్ పాలిష్ ఇచ్చినప్పుడు ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పింది – 'నేను నెయిల్ పాలిష్ వేసుకోవడం ఇదే మొదటిసారి. ఏడేళ్ళ వయసులో తీసుకువెళ్ళారు; అప్పటి నుండి పేంట్లు, షర్టులు, బూట్లే.' ఆమె గురించి నరేంద్ర మోదీ పట్టించుకున్నారు – మరెవరూ కాదు" అని ఆయన భావోద్వేగంగా చెప్పారు.

**నివాళులతో ముగింపు :** "ఈ విజయం CAPF, CRPF, కోబ్రా, DRG, ఛత్తీస్‌గఢ్ పోలీసులకు, మరియు అన్నింటికంటే ముఖ్యంగా స్థానిక గిరిజన ప్రజలకు చెందుతుంది" అని అమిత్ షా ప్రకటించారు.

1970 నుండి 2026 వరకు సాగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వేలాది సైనికులకు, అమరులైన పౌరులకు హృదయపూర్వక నివాళులు అర్పిస్తూ అమిత్ షా తన చారిత్రక ప్రసంగాన్ని ముగించారు.

భారతదేశ చరిత్రలో ఒక కీలక సంధి దాటాము – నక్సల్ రహిత భారతదేశం నిర్మాణంలో ఇది మొదటి అడుగు మాత్రమే; ఈ ప్రాంత ప్రజల సర్వతోముఖ అభివృద్ధి అనే పెద్ద యాత్ర ఇప్పుడు మరింత వేగంగా సాగనుంది.



**కె. మురళీ కృష్ణం రాజు,**
**సీనియర్ జర్నలిస్టు**

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467